


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

| RNI APTEL 2013/54510 |



సత్యం.. సమాజం.. ప్రజల కోసం..

ESTD : 2012

పల్లె వెలుగు

తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన... ఎల్లప్పుడూ...

ప్రకటనలు ఇవ్వబడును

మీ ప్రకటనకు మేమే వేదిక... విస్తృత పాఠక లోకం వరకు!

జన్మదిన శుభాకాంక్షలు | వివాహ / శుభకార్యాల ప్రకటనలు

సంతాపం / శ్రద్ధాంజలి | స్థలం / భూమి / ఇల్లు ప్రకటనలు

రాజకీయ ప్రకటనలు | ఉద్యోగ ప్రకటనలు

షాప్ / వ్యాపార ప్రారంభోత్సవాలు | విద్యా / ఆసుపత్రి ప్రకటనలు

లీగల్ నోటీసులు | టెండర్లు / ఇతర వాణిజ్య ప్రకటనలు

డాక్యుమెంట్ / పాస్‌పోర్ట్ మిస్సింగ్ నోటీసులు

మీ ప్రకటన.. మా పత్రికలో...

వేగంగా - విశ్వసనీయంగా

ఎడిటర్ : ఎం. మహేష్ యాడవ్

9440394488
9849499960



Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 285 పేజీలు - 08 వెల - 05/- ఆదివారం 11-10-2026


# ప్రకృతి సేద్యంలో ఏపీ నంబర్ వన్: సీఎం

**రసాయన ఎరువుల వాడకం తగ్గించినందుకు కేంద్రం నుంచి రూ.218 కోట్ల ప్రోత్సాహకాలు**



- ప్రకృతి సేద్యంలో దేశంలోనే ఏపీ అగ్రస్థానం
- రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులను భాగస్వాములను చేయడమే లక్ష్యం
- రసాయనాలతో పోలిస్తే ప్రకృతి సాగుతో 47 శాతం పెరిగిన రైతుల ఆదాయం
- జీవామృతం తయారీ కోసం రాష్ట్రంలో మరిన్ని గోకులాలు నిర్మిస్తామని వెల్లడి



ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులను ప్రకృతి సేద్యం వైపు ప్రోత్సహించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రకృతి సేద్యం, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎండీఎస్)పై ఆయన శనివారం టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, రైతులు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 2016లో కేవలం 40 వేల మంది రైతులతో ప్రారంభమైన ఈ ప్రస్థానం నేడు 17.73 లక్షల మందికి చేరిందన్నారు. కొందరు గతంలో ఇది విజయవంతం కాదని దుష్ప్రచారం చేసినా, రైతులు అద్భుతమైన ఫలితాలు సాధించారని కొనియాడారు. రసాయన ఎరువులతో భూసారం క్షీణించి, సాగు ఖర్చులు పెరిగి రైతులకు భారం అవుతోందన్నారు. కానీ ప్రకృతి సేద్యం ద్వారా పెట్టుబడి వ్యయం తగ్గి ఆదాయం గణనీయంగా పెరుగుతోందని వివరించారు.

*"రసాయన ఎరువులతో పోలిస్తే ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు సగటున 47 శాతం మేర ఆదాయం పెరిగింది. పత్తి పంటలో 96 శాతం, కందుల్లో 87 శాతం నికర ఆదాయం లభించింది. తీవ్రమైన కరవు పరిస్థితులను సైతం తట్టుకుని ఈ విధానంలో మంచి దిగుబడులు వస్తున్నాయి,"*

మిగతా 2లో

## తాగునీరు, సాగునీటిపై ప్రత్యేక దృష్టి!

**రాష్ట్రానికి రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కోరిన ప్రభుత్వం**

- రాబోయే ఎనిమిది నెలలు కీలకమన్న సీఎం రేవంత్‌రెడ్డి
- 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక దృష్టి
- పంటలు చేతికొచ్చే వరకు నీటి కొరత రాకుండా చూడాలి
- విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి



హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో తక్షణ చర్యలకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో సమస్యలను ఎదుర్కొనేందుకు

మిగతాది 2లో




## హైస్పీడ్ రైల్ భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన!

● భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి ● ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ చట్టవిరుద్ధమని స్పష్టీకరణ ● కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ అనంతరం ప్రకటన ● ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి

హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం

మిగతాది 2లో

## ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు..

- ఆదివారం ప్రత్యేకంగా సుప్రీంకోర్టు విచారణ
- మెట్రో మూసివేతపై కోర్టు ధిక్కరణ పిటిషన్
- ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలకు డిమాండ్
- నిరసనకారుల నిర్బంధంపైనా మరో పిటిషన్
- ప్రజా రవాణా పూర్తిగా నిలిపివేయొద్దన్న కోర్టు



ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దుపై సుప్రీంకోర్టు కీలకంగా స్పందించింది. ఈ నెల 9న ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారంటూ దాఖలైన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టనుంది. నిరసనల సమయంలో ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయకూడదని కోర్టు స్పష్టం చేసినప్పటికీ.. ఆంక్షలు కొనసాగించారన్నది పిటిషనర్ ఆరోపణ .జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును విచారించనుంది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌తో పాటు, నిరసనల సమయంలో పలువురిని నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ

మిగతాది 2లో

## జగన్‌కు ఈడీ షాక్..

**అక్రమాస్తుల కేసులపై హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ**



2లో

## నిప్పంటించిన మూక.. 35 కుటుంబాల వలస!

- పాకిస్థాన్‌లో క్రైస్తవుడిపై దైవదూషణ ఆరోపణలు
- ఆగ్రహంతో ఇల్లు, దుకాణాన్ని తగలబెట్టిన ముస్లిం మూక
- భారీగా పోలీసుల మోహరింపు, దర్యాప్తు ప్రారంభం
- దైవదూషణ చట్టాల దుర్వినియోగంపై తీవ్ర ఆందోళన



పాకిస్థాన్‌లో మతపరమైన మైనారిటీలపై దాడులు కొనసాగుతున్నాయి. పంజాబ్ ప్రావిన్స్‌లో దైవదూషణ ఆరోపణలతో ఓ క్రైస్తవుడి ఇల్లు, దుకాణానికి ముస్లిం మూక నిప్పుపెట్టింది.

మిగతాది 2లో

## 57 టీఎంసీల గోదావరి జలాలు కృష్ణాకు!

**రాష్ట్ర జల వనరుల శాఖామాత్యులు డా.నిమ్మల రామానాయుడు**

● కృష్ణా డెల్టా, రాయలసీమకు పట్టిసీమ జల భరోసా
● ఈ ఏడాది గోదావరి నుంచి కృష్ణాకు 57 టీఎంసీల నీటి తరలింపు
● 7 లక్షల ఎకరాలకు సాగునీరు.. 30 లక్షల మందికి తాగునీరు
● పట్టిసీమ లేకుంటే డెల్టాకు శ్రీశైలం నీటిని తరలించాల్సి వచ్చేది



అమరావతి,అక్టోబరు 10:పట్టిసీమ ఎత్తిపోతల ప్రాజెక్టుతో కృష్ణా డెల్టాతో పాటు రాయలసీమకు భరోసా కలిగిందంటే అది మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతకు నిలువెత్తు నిదర్శనమని రాష్ట్ర జల వనరుల శాఖామాత్యులు డా.నిమ్మల రామానాయుడు అన్నారు.కరువుసీమ సైతం జలకళతో కళకళలాడుతుందంటే పట్టిసీమే ప్రధాన కారణంగా నిలవడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. ఏపీ సచివాలయంలోని ప్రచార విభాగంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జలవనరుల శాఖామాత్యులు నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గారి అనుభవం,ఆలోచనా విధానం, ఆయన తీసుకునే నిర్ణయాలు ఎంతటి అద్భుత ఫలితాలు, సత్ఫలితాలు ఇస్తాయో పట్టిసీమ ప్రాజెక్టే ఒక ప్రత్యక్ష ఉదాహరణ అని తెలిపారు.

మిగతాది 2లో

## అమరావతి నిర్మాణంపై మంత్రి సమీక్ష!

● అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని నారాయణ ఆదేశాలు ● అక్టోబర్ 2028 నాటికి రాజధాని పూర్తి చేయడమే లక్ష్యమని వెల్లడి ● ఐకానిక్ టవర్ల పనులను పరిశీలించిన మంత్రి నారాయణ



ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు 2028 అక్టోబరు నాటికి పూర్తి చేయడమే లక్ష్యమని రాష్ట్ర మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈరోజు ఆయన రాజధాని ప్రాంతంలో పర్యటించి,

మిగతాది 2లో



2లో

## విజయవాడలో టెన్షన్.. షర్మిల గృహనిర్బంధం!

●'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకే ఈ చర్యలు ● సీఈసీ రాజీనామా కోరుతూ ఇండియా కూటమి నిరసన ● కార్యక్రమానికి అనుమతి లేదని స్పష్టం చేసిన పోలీసులు

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పోలీసులు ఈరోజు గృహనిర్బంధం చేశారు. గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో ఉన్న ఆమె నివాసం వద్ద ఉదయం నుంచే భారీగా పోలీసులను మోహరించారు. ఇండియా కూటమి పార్టీలు విజయవాడలో తలపెట్టిన 'చలో

# తాగునీరు, సాగునీటిపై ప్రత్యేక దృష్టి!

ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులపై జూబ్లీహిల్స్ నివాసంలో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి, అవగాహన కల్పించాలని సూచించారు.



రాబోయే ఎనిమిది నెలలు ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడంలో కీలకమని సీఎం పేర్కొన్నారు. ఈ కాలంలో చేపట్టే ప్రతి కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలని, సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, మార్కెట్‌లో విద్యుత్ లభ్యత సమస్యగా మారిందని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని, విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత మేరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాను సీఎంవో ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఎల్‌నినో ప్రభావంపై సినిమాలు, ప్రసార మాధ్యమాలు, కళాజాతాలు, ఇతర ప్రచార మార్గాల ద్వారా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలకు అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. రైతులు సాగు చేసిన పంటల పరిస్థితులను అంచనా వేసి, పంట చేతికొచ్చే వరకు నీటి కొరత రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో నీటి సమస్య తీవ్రం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.

రాష్ట్రంలో సుమారు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కరువు మండలాల ప్రకటనతో పాటు తగిన ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని సీఎం గుర్తుచేశారు. రాష్ట్రానికి రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరినట్లు తెలిపారు. వీబీ-జీ రామ్ జీ పథకం కింద 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల పని కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అవసరమైతే అఖిలపక్ష సమావేశం నిర్వహించే అంశాన్ని మంత్రుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం తెలిపారు. దసరా తర్వాత గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ప్రత్యేక వార్‌రూమ్ ఏర్పాటు చేయాలని, టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 57 టీఎంసీల గోదావరి జలాలు కృష్ణాకు!

ఏపీ సచివాలయంలోని ప్రచార విభాగంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జలవనరుల శాఖామాత్యులు నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గారి అనుభవం,ఆలోచనా విధానం, ఆయన తీసుకునే నిర్ణయాలు ఎంతటి అద్భుత ఫలితాలు, సత్ఫలితాలు ఇస్తాయో పట్టిసీమ ప్రాజెక్టే ఒక ప్రత్యక్ష ఉదాహరణ అని తెలిపారు. ఆనాడు పట్టిసీమ ప్రాజెక్టు నిర్మాణానికి 1600 కోట్ల రూ.లు ఖర్చు చేస్తే నేడు రూ.50,000 కోట్ల సంపద సృష్టించబడి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఫలితాలను ఇచ్చిందన్నారు. ఇది ఇంజనీరింగ్ అద్భుతమే కాక లక్షలాది రైతుల కలల ప్రాజెక్టు అని పేర్కొన్నారు. ఈ సూపర్ ఎల్ నినో సంవత్సరంలోను వర్షపు చుక్క కోసం ఎదురుచూసే పరిస్థితితో పాటు భూగర్భ జలాలు అడుగంటి ఎండలు మండుతున్నా మరో వైపు గోదావరి నుంచి ఈ ఏడాది 57 టీఎంసీల నీరు కృష్ణాకు చేరటం హర్షనీయమన్నారు. దీంతో కృష్ణా డెల్టాలో దాదాపు 7 లక్షల ఎకరాలకు సాగు నీరు అందటంతో పాటు 30 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించగలిగామన్నారు. పట్టిసీమ ఉండబట్టే నేడు దాహార్తి తీర్చుకోగలుగుతున్నామని, పంటలు పండించుకుంటున్నామని డెల్టా ప్రాంత రైతాంగం ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారన్నారు.

ఈ ఏడాది వర్షాలు పడని గడ్డు పరిస్థితుల్లో పట్టిసీమ లేకపోతే కృష్ణా డెల్టా తాగునీటి అవసరాల కోసమైనా శ్రీశైలం నుంచి కనీసం 30 నుంచి 40 టీఎంసీల నీటిని తీసుకురావాల్సి వచ్చేదని, పట్టిసీమ ద్వారా డెల్టాకు 57 టిఎంసీల నీటిని తరలించడం ద్వారా శ్రీశైలం నుంచి ఒక్క చుక్క నీరు కూడా డెల్టాకు తీసుకోకుండా ఆ నీరంతా రాయలసీమ అవసరాలకు, నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పరిధిలో తాగునీటికి వినియోగించుకో గలుగుతున్నామన్నారు. ప్రత్యక్షంగా కృష్ణా డెల్టాను ఆదుకుంటూనే, పరోక్షంగా రాయలసీమకు పట్టిసీమ ఊపిరి పోసిందన్నారు. ఈ ఏడాది శ్రీశైలానికి 200 టీఎంసీలు నీరు కూడా రాలేదని, ఇలాంటి పరిస్థితుల్లో పట్టిసీమ రైతులకు బంగారు సీమగా మారిందన్నారు. 2014-19 మధ్య అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్ రెడ్డి పట్టిసీమపై ఏ విధంగా మాట్లాడారో రికార్డుల్లో ఉందన్నారు. పట్టిసీమను 'ఒట్టిసీమ' అని, ఖర్చు పెట్టిన డబ్బంతా 'వృథా' అని, పంపులు పనికిరావని, అధికారంలోకి వస్తే 'పంపులు పీకేస్తానని' అసెంబ్లీలో మాట్లాడిన మాటలు ఇప్పటికీ ఈ ప్రాంత రైతాంగం చెవుల్లో మార్మోగుతునే ఉన్నాయన్నారు. జగన్ మోహన్ రెడ్డి పనికిరాదు, పీకేస్తానన్న పట్టిసీమే నేడు రాష్ట్రానికి 500 టీఎంసీల నీరిచ్చింది, ఈ కరవు సంవత్సరంలోనూ 57 టీఎంసీల నీరిచ్చి రూ.50,000 కోట్ల సంపదను సృష్టించిందని తెలిపారు. రాయలసీమకు, కృష్ణా డెల్టాకు జీవం పోసిన పట్టిసీమపై తప్పుడు ఆరోపణలు చేసినందుకు జగన్మోహన్ రెడ్డి తప్పు ఒప్పుకుని క్షమాపణలు చెప్పినా రాష్ట్ర రైతాంగం అతన్ని క్షమించే పరిస్థితి లేదన్నారు. జగన్మోహన్ రెడ్డి పట్టిసీమ విషయంలో ఏం చేశాడనేది 2015 నుంచి ఈ సంవత్సరం వరకు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తోందని ముఖ్యంగా ఈ సూపర్ ఎల్ నినో సంవత్సరంలో అది స్పష్టంగా రుజువైందన్నారు.

గోదావరి జిల్లా వాసిగా చెబుతున్నా తీవ్రమైన ఎల్ నినో సంవత్సరంలోనూ నేటి వరకు దాదాపు 1,550 టీఎంసీల గోదావరి నీరు సముద్రంలోకి వృథాగా పోయింది, ఇంకా పోతూనే ఉంది. కృష్ణా నదిలో ఈ ఏడాది మొత్తం కలిపినా 200 టీఎంసీల నీరు రాలేదు కానీ గోదావరిలో కేవలం రెండు రోజుల్లోనే 250 టీఎంసీల నీరు సముద్రంలో కలిసిపోయిందని,గోదావరి వరద నీటిని ఒడిసిపట్టి కృష్ణా డెల్టాకు తరలించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపిన ముందుచూపు అద్భుతమన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తయ్యేలోపే సముద్రంలోకి వృథాగా పోయే గోదావరి జలాలను రాష్ట్ర ప్రయోజనాలకు వాడుకోవాలనే మహత్తర ఆలోచనతోనే చంద్రబాబు నాయుడు గారు రూ. 1,600 కోట్లతో పట్టిసీమకు రూపకల్పన చేశారని, తద్వారా రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను కాపాడారని కొనియాడారు.

రూ.1600 కోట్ల వ్యయంతో నేటికి రూ. 50,000 కోట్లకు పైబడి సంపద సృష్టిస్తే ఇప్పుడు వైసిపి అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఏ ముఖం పెట్టుకుని రాజకీయాల్లో ఉంటారని రైతాంగం తరపున ప్రశ్నిస్తున్నానని మంత్రి రామానాయుడు పేర్కొన్నారు. నాగలిని ఆయుధంగా మలిచి రాష్ట్రమంతా నీరు పారించి సస్యశ్యామలం చేసే ఎన్డీయే కూటమి ప్రభుత్వమే ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఎన్ని రాజకీయ విమర్శలు ఎదురైనా, ప్రకృతి వైపరీత్యాలు అడ్డుపడినా ఇంజనీర్ల పట్టుదలతో, మహా సంకల్పంతో రైతుల ప్రయోజనాలను కాపాడిన పట్టిసీమ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.

ఈ సమావేశంలో ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ లు డి. వెంకటేశ్వరరావు, మురళీధరరావు, రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, సాగునీటి సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# హైస్పీడ్ రైల్ భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన!

భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-పుణె హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై చర్చించారు. సమావేశం అనంతరం ఈ వివరాలను కిషన్ రెడ్డి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. "రైల్వే మంత్రి స్పష్టం చేసిన దాని ప్రకారం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి భూసేకరణ అభ్యర్థనలు పంపలేదు. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో జరుగుతున్న ఏ భూసేకరణ అయినా చట్టవిరుద్ధం" అని కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో, రైతులతో పంచుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైల్ కారిడార్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ స్పష్టత రావడం గమనార్హం. మరోవైపు కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంపై దక్షిణ మధ్య రైల్వే కూడా స్పందించింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్ కనెక్టివిటీకి సంబంధించిన ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఇరువురు మంత్రుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని సోషల్ మీడియాలో పేర్కొంది. ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేలు 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై వరకు బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. అలాగే, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపారు.

# ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు..

నిరసనల సమయంలో పలువురిని నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌నూ ధర్మాసనం పరిశీలించనుంది.

నిరసనకారుల నిర్బంధంపైనా విచారణ

ఢిల్లీలో శనివారం జరిగిన నిరసనల సందర్భంగా ప్రతిపక్ష నేతలను ముందస్తుగా నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. నలుగురు మాజీ ముఖ్యమంత్రులు సహా ప్రతిపక్ష నేతలను నిర్బంధించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేయడానికి ముందస్తు నిర్బంధాన్ని ఉపయోగించకూడదని ఆమె వాదించారు. నిరసనకారులను రోడ్లపై నుంచి, ప్రతిపక్ష నేతలను వారి ఇళ్ల నుంచి పోలీసులు తీసుకెళ్లడంపైనా ప్రశ్నించారు. ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలు కోరుతూ పిటిషన్

కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) ఛైర్‌పర్సన్ డి.థారాపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని త్రిపాఠి కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదని ఆరోపించారు. మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలపై కోర్టు ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు.

### అక్టోబర్ 9న సుప్రీంకోర్టు ఏమంది?

ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టనున్న నేపథ్యంలో 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని ఢిల్లీ పోలీసులు సూచించారు. న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు వచ్చే మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లపైనా ఆంక్షలు విధించారు. ఆ తర్వాత డీఎంఆర్‌సీ మూసివేతల సంఖ్యను 45కి తగ్గించింది. ఈ ఆంక్షలపై విచారణ సందర్భంగా ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయడం

# ప్రకృతి సేద్యంలో ఏపీ నంబర్ వన్: సీఎం

(మొదటి పేజీ తరువాయి)

అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి సాగు విధానాలను అధ్యయనం చేసేందుకు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి సేద్యంలో గుజరాత్ కంటే ఏపీ ముందంజలో ఉందని ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ప్రశంసించారని గుర్తుచేశారు. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో రసాయన ఎరువుల వినియోగం 2.28 శాతం తగ్గిందని, దీనికి గాను కేంద్రం నుంచి రావాల్సిన రూ.218 కోట్ల ప్రోత్సాహకాల కోసం ఇప్పటికే లేఖ రాశామని చంద్రబాబు వెల్లడించారు. ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించేందుకు అనంతపురం జిల్లాలో 10 లక్షల పంట కుంటలు, చెక్ డ్యామ్‌లు తవ్వించామని, నదుల అనుసంధానంతో వర్షాభావ పరిస్థితులను కూడా అధిగమించవచ్చని అన్నారు. కషాయం, జీవామృతం తయారీకి అవసరమైన దేశీయ ఆవుల కోసం మరిన్ని గోకులాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి సేద్యాన్ని ముందుకు తీసుకెళ్తున్న రైతులే తనకు అసలైన స్ఫూర్తి అని, వారి కృషి అభినందనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# అమరావతి నిర్మాణంపై మంత్రి సమీక్ష!

(మొదటి పేజీ తరువాయి)

ఈరోజు ఆయన రాజధాని ప్రాంతంలో పర్యటించి, ఐకానిక్ టవర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత నెలలో వర్షాల కారణంగా పనులకు కొంత ఆటంకం కలిగిందని, ఇప్పుడు పనులు తిరిగి వేగం పుంజుకున్నాయని తెలిపారు. ఐకానిక్ టవర్ల నిర్మాణంలో మొదటి డయాగ్రిడ్ పూర్తయిందని, ప్రతి రెండు నెలలకు 6 అంతస్తుల నిర్మాణం పూర్తయ్యేలా లక్ష్యం నిర్దేశించామని వివరించారు. ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టు ఫౌండేషన్ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నివాస భవనాలు తుది దశకు చేరుకున్నాయని, నవంబర్ 11 తర్వాత వాటి ప్రారంభోత్సవాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో ప్రస్తుతానికి స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నామని తెలిపారు. రాజధాని నిర్మాణంపై కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారని నారాయణ మండిపడ్డారు. విమర్శలు చేసేవారు అమరావతికి వచ్చి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూస్తే వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో 35 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పనులను వేగవంతం చేసేందుకు ప్రతి నిర్మాణ సంస్థకు స్పష్టమైన టార్గెట్లు విధించామని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ కోసం ల్యాండ్ పూలింగ్ చాలా వరకు పూర్తయిందని, డిసెంబర్ నాటికి రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించి సింగపూర్ మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతుందని వెల్లడించారు.

# విజయవాడలో టెన్షన్.. షర్మిల గృహనిర్బంధం!

(మొదటి పేజీ తరువాయి)

గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో ఉన్న ఆమె నివాసం వద్ద ఉదయం నుంచే భారీగా పోలీసులను మోహరించారు. ఇండియా కూటమి పార్టీలు విజయవాడలో తలపెట్టిన 'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున పేర్లు తొలగించారని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఈ ఉదయం 10 గంటలకు విజయవాడలోని లెనిన్ సెంటర్ నుంచి రాజ్‌భవన్ వరకు యాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. అయితే, ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే షర్మిలతో పాటు పలువురు కాంగ్రెస్, వామపక్ష పార్టీల కీలక నేతలను పోలీసులు ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేస్తున్నారు. మరోవైపు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజ్‌భవన్ వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసుల ఆంక్షల నడుమ షర్మిల ఇంటి నుంచి బయటకు వస్తారా, లేదా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయోనని సర్వత్ర ఆసక్తి నెలకొంది.

# జగన్‌కు ఈడీ షాక్..

- జగన్ అక్రమాస్తుల కేసులపై తెలంగాణ హైకోర్టులో ఈడీ పిటిషన్
- రోజువారీ విచారణ జరపాలని పిటిషన్‌లో అభ్యర్థన
- దశాబ్దకాలంగా సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు
- విచారణకు జగన్ వ్యక్తిగతంగా హాజరు కావాలని వినతి

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసుల్లో రోజువారీ విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని ఈడీ తన పిటిషన్‌లో అభ్యర్థించింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు సంబంధించి ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లు దాదాపు దశాబ్ద కాలంగా సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తెలిపింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లు పరిష్కారం కాకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని పేర్కొంది. విచారణకు జగన్‌తో పాటు ఇతర నిందితులంతా వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని కూడా ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది. గత కొన్నేళ్లుగా ఈ కేసుల్లో ప్రత్యేక కోర్టుల విచారణ, ఉన్నత న్యాయస్థానాల్లో సవాళ్లు వంటి పలు న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ జరగాల్సి ఉంది.

## నిప్పంటించిన మూక..

# 35 కుటుంబాల వలస!

(మొదటి పేజీ తరువాయి)

ఓ క్రైస్తవుడి ఇల్లు, దుకాణానికి ముస్లిం మూక నిప్పుపెట్టింది. ఈ ఘటనతో భయాందోళనకు గురైన 35కు పైగా క్రైస్తవ కుటుంబాలు ప్రాణభయంతో తమ ఇళ్లను విడిచి సురక్షిత ప్రాంతాలకు పారిపోయాయి. క్రిస్టియన్ డైలీ ఇంటర్నేషనల్-మార్నింగ్ స్టార్ న్యూస్ కథనం ప్రకారం పంజాబ్ ప్రావిన్స్‌లోని షేఖుపురా జిల్లా, ఘరియల్ కలాన్ గ్రామంలో ఈ దారుణం జరిగింది. గ్రామంలో ఫార్మసీ నడుపుతున్న కమ్రాన్ మసీహ్ (40) అనే వ్యక్తి వాట్సాప్ గ్రూపుల్లో దైవదూషణకు సంబంధించిన వీడియోను షేర్ చేశాడని స్థానిక ముస్లింలు ఆరోపించారు. ఈ ఆరోపణలతో గురువారం రాత్రి పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఈ విషయం తెలియగానే శుక్రవారం రోజున వందలాది మంది ముస్లింలు కమ్రాన్ దుకాణం, ఇంటి వద్ద గుమిగూడారు. కొద్దిసేపటికే ఆగ్రహంతో ఊగిపోయిన కొందరు వ్యక్తులు ఆ రెండు భవనాలకు నిప్పుపెట్టారు. కమ్రాన్ అరెస్టు, ఆస్తుల ధ్వంసం వార్త తెలియగానే, గ్రామంలోని ఇతర క్రైస్తవ కుటుంబాలు మూకదాడులు జరగవచ్చనే భయంతో ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కమ్రాన్‌పై దైవదూషణ చట్టంలోని ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారనే దానిపై స్పష్టత లేదని ఆయన బంధువులు పేర్కొన్నారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. క్రైస్తవుల ఆస్తులు, నివాసాలకు రక్షణ కల్పించేందుకు భారీ సంఖ్యలో పోలీసులను మోహరించినట్లు షేఖుపురా జిల్లా పోలీస్ కార్యాలయం తెలిపింది. ప్రస్తుతం పరిస్థితి సున్నితంగా ఉన్నందున, దర్యాప్తు వివరాలు వెల్లడించలేమని ఓ అధికారి తెలిపారు.

### దుర్వినియోగమవుతున్న దైవదూషణ చట్టాలు

పాకిస్థాన్‌లో దైవదూషణ చట్టాలు తరచూ దుర్వినియోగం అవుతున్నాయని, వ్యక్తిగత కక్షలు, తగాదాల కోసం వీటిని వాడుకుంటున్నారని మానవ హక్కుల సంఘాలు ఎప్పటినుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా మతపరమైన మైనారిటీలే లక్ష్యంగా ఈ చట్టాలను ప్రయోగిస్తున్నారని ఆరోపిస్తున్నాయి. గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా నమోదైన 333 దైవదూషణ కేసుల్లో చాలా వరకు తప్పుడువని ఇటీవల ఓ పార్లమెంటరీ కమిటీకి అధికారులు నివేదించారు. అత్యధికంగా పంజాబ్ ప్రావిన్స్‌లోనే 116 కేసులు నమోదైనట్లు అధికారిక డేటా వెల్లడించింది. చాలా కేసుల్లో ఆరోపణలకు సరైన ఆధారాలు లేకపోవడంతో కొట్టివేసినట్లు అధికారులు కమిటీకి తెలిపారు. దైవదూషణ చట్టాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో, మైనారిటీలను రక్షించడంలో పాక్ ప్రభుత్వం విఫలమవుతోందని 'వాయిస్ ఆఫ్ పాకిస్థాన్ మైనారిటీ' వంటి సంస్థలు ఆరోపిస్తున్నాయి.

# శ్రీకృష్ణ గోశాలలో గోమాతలకు ఘనంగా పూజలు

☛అమావాస్య సందర్భంగా పచ్చగడ్డి అందజేత, ప్రత్యేక అర్చనలు

☛గోసంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: సామాజిక వేత్త గుజ్జుల గౌరీశ్వర నాయుడు





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో పట్టణంలోని మిడుతూరు రోడ్డులో వెలసిన శ్రీకృష్ణ గోశాలలో శనివారం అమావాస్యను పురస్కరించుకుని గోమాతలకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోమాత సంకల్ప దీక్షాపరులు సఫారే గోవిందరాజులు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆవులకు ప్రత్యేక పూజలు చేసి, పచ్చగడ్డి తినిపించి గోసేవ చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సామాజిక సేవకులు గుజ్జుల గౌరీశ్వర నాయుడు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో గోవును సాక్షాత్తూ తల్లిగా, సకల దేవతల నిలయంగా కొలుస్తారని తెలిపారు. గోమాతను ఆరాధించడం వల్ల కోటి దేవతలను పూజించినంత పుణ్యఫలం దక్కుతుందన్నారు. గోవు అందించే పాలు సంపూర్ణ పోషక విలువలతో చిన్నారుల శారీరక ఎదుగుదలకు తోడ్పడతాయని వివరించారు. గోమూత్రం, పేడ సేంద్రియ వ్యవసాయానికి జీవనాధారమని, భూసారాన్ని పెంచి రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తాయని పేర్కొన్నారు. గోసంరక్షణ, వాటి పోషణ, అనారోగ్యానికి గురైన గోవులకు చికిత్స అందించడం సమాజంలో ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోశాల నిర్వాహకులు అలువాల కిషోర్ కుమార్ గుప్తా దంపతులు, మాలే రాజేష్ గుప్తా దంపతులు, గౌరీశ్వర నాయుడు దంపతులు, పీఈటీ వెంకటేష్, బాసూత్కర్ ఎల్లోజీరావు, మూల రాజశేఖర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ వద్దు ఆరోగ్యం ముద్దు



పల్లె వెలుగు:డ్రగ్స్ వినియోగం సమాజానికి దురాచారంగా ప్రభిలింది డ్రగ్స్ కేంద్ర నాడీ వ్యవస్థ పై ప్రభావం చూపి మనిషిని దీర్ఘకాలిఅనారోగ్య సమస్యల పాలు చేస్తుంది.జీర్ణ వ్యవస్థ దెబ్బతిని శరీరం శుష్కిస్తుంది.లివర్ పై ఒత్తిడి పెరిగి పనిచేయని స్థితి వస్తుంది.గుండె వేగంలో మార్పులు వస్తాయి.గుండెపోటుతో మరణాలు సంభవిస్తాయి.జ్ఞాపక శక్తి క్షీణిస్తుంది ఒత్తిడి పెరిగి ఏకాగ్రత హింసాత్మక ఆలోచనలు పురుడు పోసుకోని ప్రగతిని అడ్డుకుంటుంది.మెదడు దెబ్బతిని మూర్ఛ వ్యాధి వస్తుంది 60 ఏళ్ల క్రితమే మనుషులు మత్తుకు మరిగినట్లు చరిత్ర చెబుతుంది.గంజాయి హీరోయిన్ వివిధ రూపాల్లో లభించే డ్రగ్స్ పిల్లలు యువత విచ్చలవిడిగా వినియోగించి డ్రగ్స్ బారిన పడితమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారు.రెండు తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ నిర్మూలనకు ఈగల్ అనే పేరుతో ప్రత్యేక కార్యాచరణ ప్రవేశ పెట్టడం అభినందనీయం.నేదునూరికనకయ్య అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరంకరీంనగర్.

## దసరా మహోత్సవాలకు హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం



బనగానపల్లె, అక్టోబర్ 10,పల్లెవెలుగు బనగానపల్లె నియోజకవర్గం కోవెలకుంట పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో జరిగే దేవీ నవరాత్రి, దసరా మహోత్సవాల సందర్భంగా బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే శ్రీ కాటసాని రామిరెడ్డి గారి స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గారికి దసరా మహోత్సవ ఆహ్వాన పత్రికను కోవెలకుంట్ల పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు పెండేకంటి నాగరాజు,పట్టణ అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం,బొగ్గరపు శ్రీనివాసమూర్తి,భూమా నాగరాజు,పెండేకంటి మణి,లక్ష్మీనారాయణ,సాయి ధీరజ్,సముద్రాల సందీప్,దినేష్ లు అందజేశారు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కి శాలువాకప్పి మెమెంటోను అందజేసినారు

## మహానందీశ్వరుని సేవలో ప్రముఖుల పూజలు

మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలో విద్యుత్ శాఖకు చెందిన ఏపీఈఆర్ సీ ఛైర్మన్ వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులు,నార్త్ ఎగ్యుక్యుటివ్ ఇంజినీర్ సురేంద్రనాథ్ పూజలు నిర్వహించారు. శనివారం వీరికి అధికారులు స్వాగతం పలికారు. శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. వీరి వెంట నంద్యాల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యం, మహానంది ఇన్చార్జి ఏఈఈ ప్రభాకర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



# పాత సత్రంలోనే గ్రంథాలయం పాఠకులకు తప్పని ఇబ్బందులు

**నూతన భవనం నిర్మించాలి ఏఐటీయూసీ మండల కార్యదర్శి మహేష్ డిమాండ్**




కొలిమిగుండ్ల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు, నిరుద్యోగ యువత, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు, పుస్తక పఠనంపై ఆసక్తి ఉన్న పాఠకులకు ఎంతో ఉపయోగకరంగా ఉండాల్సిన గ్రామ గ్రంథాలయం ప్రస్తుతం పాత సత్రంలోకొనసాగుతుండటంతో, పాఠకులకు మరింత మెరుగైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని ఏఐటీయూసీ యూనియన్ కొలిమిగుండ్ల మండల కార్యదర్శి మహేష్ కోరారు. గ్రంథాలయాన్ని నూతన భవనంలోకి మార్చి, విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల భవిష్యత్తుకు గ్రంథాలయమే బలమైన పునాది

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత తమ లక్ష్యాలను సాధించాలంటే నిరంతర అధ్యయనం ఎంతో అవసరం. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు రోజువారీ దినపత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్, చరిత్ర, రాజ్యాంగం, విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉండాలి. అలాంటి అవసరాలను తీర్చే గ్రంథాలయం పాఠకులకు అనుకూలమైన భవనంలో ఉండటం అత్యంత ముఖ్యం. గ్రామీణ విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఖరీదైన పుస్తకాలు కొనలేని పరిస్థితుల్లో ప్రభుత్వ గ్రంథాలయాలే వారికి ప్రధాన ఆధారంగా నిలుస్తాయి.

పాత సత్రం నుంచి నూతన భవనానికి మార్చాలి

గ్రామంలో ప్రస్తుతం పాత సత్రంలో కొనసాగుతున్న గ్రంథాలయాన్ని నూతన భవనంలోకి ఏర్పాటు చేస్తే పాఠకులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని మహేష్ అభిప్రాయపడ్డారు. చదువుకునేందుకు అనువైన వాతావరణం, తగినంత వెలుతురు, గాలి, కూర్చునేందుకు అవసరమైన బల్లలు, కుర్చీలు, పుస్తకాలను భద్రపరిచే ర్యాకులు, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన భవనంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులు, యువత, ఇతర పాఠకులు ఎక్కువ సమయం చదువుపై దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలి

గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయి. పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడం, యువతలో విజ్ఞానాన్ని పెంపొందించడం, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు సహకారం అందించడం వంటి లక్ష్యాలను నెరవేర్చాలంటే గ్రంథాలయాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలి. ఈ నేపథ్యంలో సంబంధిత గ్రంథాలయ అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం, సంబంధిత ప్రభుత్వ శాఖ ఉన్నతాధికారులు ఈ అంశాన్ని పరిశీలించి, నూతన భవనంలో గ్రంథాలయం ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

యువత చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలి

గ్రామంలోని విద్యార్థులు, నిరుద్యోగ యువత చదువుకు దూరం కాకుండా, వారికి అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వ శాఖలు ప్రోత్సహించాలని మహేష్ అన్నారు. గ్రంథాలయం అనేది కేవలం పుస్తకాలు నిల్వ చేసే ప్రదేశం మాత్రమే కాదని, విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే విజ్ఞాన కేంద్రం అని పేర్కొన్నారు. అందువల్ల గ్రామ గ్రంథాలయాన్ని నూతన భవనంలోకి మార్చే అంశాన్ని అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ యూనియన్ మండల కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు కృష్ణ కిషోర్, శివ, కొండయ్య,మతేష్ పాల్గొనడం జరిగినది.

# ఎస్ఐఆర్ పేరుతో కోట్లాది ఓట్ల తొలగింపు..

☛కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల మంది ఓటర్లను తొలగించారని అందుకు బాధ్యుడైన కేంద్ర ఎన్నికల అధికారి జ్ఞానేశ్వర్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని కోరుతూ సిపిఐ కాంగ్రెస్. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సంజీవ నగర్ సెంటర్ నందు పొట్టి శ్రీరాములు విగ్రహం ఎదుట నిరసన తెలుపుతూ జ్ఞానేశ్వర్ చిత్రపటాలను దగ్ధం చేస్తుండగా పోలీస్ యంత్రాంగం అడ్డుకోవడం జరిగిందని, అయినా పట్టు విడవకుండా జ్ఞానేష్ కుమార్ బ్యానర్ దగ్ధం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, సిపిఐ పట్టణ కార్యదర్శి కే.ప్రసాద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు. చింతలయ్య, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు. భూమిని శ్రీనివాసులు, లక్ష్మీదేవి ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి. శ్రీనివాసులు, ఏ ధనుంజయుడు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జి హరినాథ్, పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,

దేశంలో అధికారం కోసం బిజెపి ప్రభుత్వం తన ప్రజా సంఘాల మాదిరిగా ఎన్నికల మోర్చాగా ఎన్ని గల కమిషన్ను నియమించుకొని అన్ని రాష్ట్రాలలో అధికారం కోసం లక్షలాది ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని




తొలగించడంతోపాటు దేశంలో 13 కోట్ల ఓట్లను తొలగించి రక్తపాతం లేకుండా మారణకాండ సృష్టిస్తున్న ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ ను నియమించుకొని పాలిస్తున్న పాలకులకు జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయమని ఢిల్లీలో చేస్తున్న ఇండియా కూటమికి. సి జె పి యువనాయకత్వానికి అడ్డుకట్ట వేసే విధంగా పోలీస్ యంత్రాంగాన్ని దించడం 57 మెట్రో స్టేషన్లను రద్దు చేయడం

ప్రజాస్వామ్యాన్ని ఖుని చేయడమేనని విమర్శించారు.

ఆంధ్రప్రదేశ్ లో సుమారు 50 వేల మంది ఓటర్ల పేర్లను ఏకపక్షంగా తొలగించారని ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కును ఎస్ఐఆర్ పేరుతో భారీ సంఖ్యలో ఓట్లను తొలగించి, అర్హులైన పౌరులకు ఓటు హక్కు కల్పించకుండా ఎన్నికలు నిర్వహించి విజయం సాధించామని చెప్పుకోవడం ప్రజలను వంచించడమేనని . ఓటు హక్కుపై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేయడమేనని ఈ పరిస్థితులకు బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జ్ఞానేశ్ కుమార్ ఫోటోలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# లక్ష్మీపురంలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్: భారీగా అక్రమ మద్యం పట్టివేత

☛ముగ్గురిపై కేసులు నమోదు

☛672 మద్యం బాటిళ్లు స్వాధీనం

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రూరల్ పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో పోలీసులు శనివారం ఉదయం ఆకస్మికంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లలో నిల్వ ఉంచిన భారీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులపై కేసులు నమోదు చేశారు.

కర్నూలు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కర్నూల్ ఎస్డీపీఓ పర్యవేక్షణలో రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో ఉలిందకొండ ఎస్సై, నాగలాపురం ఎస్సైలతో పాటు భారీ సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలోని అనుమానితులు, రౌడీషీటర్లు, అల్లరి మూకల ఇళ్లలో అంగుళం అంగుళం క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు.

ఈ సోదాల్లో ముగ్గురు వ్యక్తుల వద్ద మొత్తం 672 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి:

తిమ్మయ్య: 384 మద్యం బాటిళ్లు

శేఖర్: 144 చీప్ లిక్కర్ బాటిళ్లు



సురేష్: 144 మద్యం బాటిళ్లు

అక్రమంగా మద్యం నిల్వ చేసిన ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు సీఐ చంద్రబాబు నాయుడు తెలిపారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

# నాటి దౌర్జన్యకర సంఘటనలు గుర్తుకు రాలేదా?

బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 10:అన్ని



గ్రామ పంచాయతీలలో రాబోవు ఎన్నికలలో కచ్చితంగా పోటీ చేస్తాం! ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ధైర్యంగా నామినేషన్ వేయండి! నేను చూసుకుంటా! ఈ విషయంలో పోలీసులు దౌర్జన్యాలు, అభ్యర్థులను ఎత్తుకెళ్లడాలు లాంటి చర్యలకు పాల్పడితే వారిపై ప్రైవేటు కేసులు వేసేందుకు వెనుకాడే ప్రసక్తే లేదు, అంటూ శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు శిల్పా చక్రపాణి రెడ్డి గత కొద్ది కాలం నుండి నియోజకవర్గంలో కార్యకర్తలను సమీకరించే ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అయితే గతంలో వైఎస్ఆర్ పార్టీ అధికారంలో ఉన్న పరిస్థితులలో పంచాయతీ ఎన్నికలు జరిగినప్పుడు మీరు చేసిన దౌర్జన్యకర సంఘటనలు ఒకసారి గుర్తుకు తెచ్చుకోవాలని టిడిపి వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. బండి ఆత్మకూరు మండలంలో 20 పంచాయతీలు ఉండగా, 16 గ్రామపంచాయతీలను ఏకగ్రీవంగా మీరు ఎన్నిక చేసుకోలేదా అంటూ టిడిపి వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఎంపీటీసీ ఎన్నికలలో కూడా ఇదే పంథా ను అనుసరించారని, నాడు పోలీసులను అడ్డం పెట్టుకొని ఏకగ్రీవాల ఎన్నికలు నిర్వహించుకొని, ప్రస్తుతం ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో పోలీసులను బాధ్యులను చేయడం ఎంతవరకు సబబని కూడా ప్రశ్నలు సంధిస్తున్నారు. గాలి చెన్నయ్యపాలెం గ్రామంలో పంచాయతీ ఎన్నికలలో టిడిపి అభ్యర్థి గెలిచినప్పటికీ, మీ పార్టీ నాయకులు అక్కడ దౌర్జన్యం చేసిన సంఘటనలు గుర్తుకు రాలేదా అంటూ విమర్శిస్తున్నారు. ఇదే గ్రామంలో ఈ విషయంపై ఓ మహిళా కానిస్టేబుల్ అడ్డుకోకపోతే ఆమెపై మీ పార్టీ వాళ్లు దాడి చేసిన సంఘటనలు మరిచిపోయారా? ఈ విషయాన్ని గుర్తుకు తెచ్చుకోండి అంటూ కూడా ప్రశ్నిస్తున్నాయి. జడ్పిటిసి ఎన్నికల సమయంలో కూడా బండి ఆత్మకూరులో కొందరు టిడిపి కార్యకర్తలు నామినేషన్ వేస్తే, వారిని బెదిరించి నామినేషన్లను విత్డ్రా చేయించి జెడ్పిటిసి ఎన్నిక ఏకగ్రీవం చేసుకున్న సంగతి మరిచిపోయారా అంటూ ప్రశ్నలు సంధిస్తున్నారు. త్వరలో జరగబోవు పంచాయతీ ఎన్నికలలో ఏ ఒక్క పంచాయతీ ఏకగ్రీవం జరిగినా, ఆ ప్రాంత మాజీ ఎమ్మెల్యేలు భవిష్యత్తులో అసెంబ్లీ టికెట్ కోల్పోతారని మీ పార్టీ అధినాయకుడు జగన్మోహన్ రెడ్డి హెచ్చరించడంతో, ఎక్కడ టికెట్ రాదన్న భయంతో మీరు ప్రస్తుతం గ్రామాలు పట్టుకొని తిరగడం లేదా అంటూ టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు. ఐదేళ్లు మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసింది ఏమీ లేదని, ఏ ఒక్క గ్రామంలోనూ సిమెంట్ రోడ్లు వేసిన పాపాన పోలేదని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి గ్రామ గ్రామానికి సిమెంట్ రోడ్లు వేసేందుకు కోట్ల రూపాయలు కేటాయించారని, పార్టీలకతీతంగా గ్రామాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించారన్న విషయాన్ని గమనించాలని అంటున్నారు. గ్రామాలలో మా ప్రభుత్వ హయాంలోనే అన్ని రకాలుగా అభివృద్ధి చెందాయని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని పంచాయతీ ఎన్నికలలో తమ తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరుతామని పేర్కొంటున్నారు. ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, లేనప్పుడు ఇంకో మాట మాట్లాడటం మీకే చెల్లుతుందని పేర్కొంటున్నారు. నాడు ఏకగ్రీవాలు చేసుకుని, నేడు పోటీ చేస్తామని చెప్పడాన్ని బట్టి చూస్తే, ఏరు దాటాక తెప్ప తగలేసినట్లుగా మీ వైఖరి ఉందని టిడిపి వర్గీయులు విమర్శిస్తున్నారు.

# కూటమి ప్రభుత్వం నీచ రాజకీయాలు మానుకోవాలి

- రాష్ట్రంలో బ్రిటిష్ పాలన సాగుతోంది: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి
- నాపై రాజకీయ కుట్రతోనే అక్రమ కేసులు: ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి
- 69 రోజుల రిమాండ్ అనంతరం జైలు నుంచి ఎమ్మెల్యే, అనుచరులు విడుదల





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు, నీచ రాజకీయాలకు పాల్పడుతోందని, బ్రిటిష్ పరిపాలనను తలపించేలా చంద్రబాబు పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అక్రమ కేసులతో 69 రోజుల పాటు కర్నూలు సబ్ జైలులో రిమాండ్‌లో ఉండి బెయిల్‌పై శనివారం విడుదలైన ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి, ఆయన సోదరుడు శ్రీరాములు, కుమారుడు చంద్రశేఖర్‌తో పాటు మరో 25 మందికి ఎస్వీ మోహన్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కర్నూలు సబ్ జైలు వద్ద ఎస్వీ మోహన్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. టిడిపి నేత స్వయంగా తన భార్య బట్టలు చించి, ఎమ్మెల్యే విరూపాక్షితో పాటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఆగస్టు 1న చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం సహా మూడు అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. భర్తే స్వయంగా బట్టలు చించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో బహిర్గతం కావడంతో కూటమి ప్రభుత్వ నిరంకుశత్వం బట్టబయలైందన్నారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే విరూపాక్షి కడిగిన ముత్యంలా బయటకు వచ్చారని చెప్పారు. టిడిపి అధికారం శాశ్వతం కాదని, పార్టీ కార్యాలయం ఆదేశాలతో తప్పుడు కేసులు నమోదు చేసిన పోలీసులపై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. నాపై కక్ష సాధింపు చర్యలు: ఎమ్మెల్యే విరూపాక్షి పార్టీ కార్యకర్తను పరామర్శించేందుకు వెళ్లిన తనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ కుట్రపూరితంగా కేసులు పెట్టించి జైలుకు పంపారని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ఆరోపించారు. స్థానిక టిడిపి ఇన్‌ఛార్జ్ వైకుంఠ జ్యోతి ఎస్సీలను అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలకు పాల్పడ్డారని విమర్శించారు. డీఐజీ కోయ ప్రవీణ్, కూటమి నేతలు కుమ్మక్కై తనను 69 రోజుల పాటు అక్రమంగా నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబు వాల్మీకులను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని, గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకులకు రాజకీయంగా పెద్దపీట వేసి ఎమ్మెల్యేలు, ఎంపీలుగా అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. ఈ కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచిన వైఎస్ జగన్‌కు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. అక్రమ కేసులకు భయపడేది లేదని, ఈ వ్యవహారంలో చట్టపరమైన న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# పాఠశాలల అభివృద్ధి అంటే ఇలాగేనా?

దొర్నిపాడు అక్టోబర్ 10 పల్లె వెలుగు న్యూస్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు పెద్దపీట వేస్తూ పాఠశాలల అభివృద్ధి కొరకు లక్షల నిధులు మంజూరు చేసి నూతన భవన నిర్మాణాలు ,తరగతి గదులు క్రీడా ప్రాంగణ మైదానాలు పాఠశాలల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణాల కొరకు మంజూరు చేసిననిధులుఏమవుతున్నాయో ఎవరికీ అంతుపట్టడం లేదని ప్రజలు అంటున్నారు, మండల కేంద్రమైన దొర్నిపాడు జడ్పీ పాఠశాల కు ప్రహరీ గోడ లేక పోవడము అదేవిధంగా తరగతి గదుల ప్రక్కన మురికి కాలువ కంప పొదలు, పిచ్చి మొక్కలతో దుర్వాసన కొడుతూ ఉన్న పట్టించుకున్న నాధుడే లేడు ఈ పరిస్థితి చూస్తుంటే నిధులు లేఖన ఉంటేఏమయ్యాయో అంతు పట్టడంలేదు, ముఖ్యంగా వంటగది ప్రక్కన ఉన్న ప్రహరీ గోడ పడిపోవడంతో చుట్టూ ఉన్న కుక్కలు ,పందులు పాఠశాలలోనికి ప్రవేశిస్తున్నాయి వంట అయిన తర్వాత పోసిన నీళ్లు కాలువ లోచేరడంతో దీనికి తోడు ముళ్ల పొదలు పిచ్చి మొక్కలు ఉండడం వల్ల దోమలు ఈగలు, విద్యార్థుల తరగతి గదులలో చేరుతున్నాయి, దీంతో విద్యార్థులు అనారోగ్యానికి గురి అయ్యేప్రమాదం పొంచి ఉంది ఎన్ని నిధులు వచ్చినా కనీస అవసరాలు అయిన వంటగది ప్రక్కన గోడ నిర్మాణం మురికి కూపంలఉన్న కంప పొదలను తొలగించాలి అనే ఆలోచన ఎస్ఎంసి చైర్మన్ లకు గాని పాఠశాల ఉపాధ్యాయులకు గాని రాకపోవడం చాలా బాధాకరంగా ఉందంటున్నారుప్రజలు,పాఠశాలలోతరగతిగదులవసతులు ,క్రీడా మైదానము ,ఉత్తీర్ణత శాతం క్రీడల్లో పాఠశాలకు బంగారు పతకాలు, అన్ని బాగున్నాయి ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ప్రహరీగోడనిర్మాణంముళ్ళ పొదలను తొలగించి మురికి కాలువ లేకుండా చేస్తే విద్యార్థులవిద్యకు అంతరాయం ఉండదు,



## నంద్యాల చెక్‌పోస్ట్ వద్ద పోలీసుల విస్తృత వాహన తనిఖీలు

- రంగంలోకి శిక్షణ పూర్తి చేసుకున్న నూతన మహిళా కానిస్టేబుళు
- సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో నగరంలోని నంద్యాల చెక్‌పోస్ట్ వద్ద శనివారం సాయంత్రం కర్నూలు త్రీటౌన్ పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం 5:00 గంటల నుంచి రాత్రి 7:00 గంటల వరకు చేపట్టిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో, ఇటీవల శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరిన నూతన మహిళా కానిస్టేబుళ్లతో పాటు త్రీటౌన్ పోలీసు సిబ్బంది చురుగ్గా పాల్గొన్నారు. త్రీటౌన్ ఎస్సైలు చంద్రశేఖర్ రెడ్డి, బాల నరసింహులుల ఆధ్వర్యంలో చెక్‌పోస్ట్ మీదుగా రాకపోకలు సాగించే ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. హెల్మెట్ లేని ప్రయాణాలు, ట్రిపుల్ రైడింగ్, నంబర్ ప్లేట్లు సరిగా లేకపోవడం, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ వంటి సరైన పత్రాలు లేని పలు వాహనాలను గుర్తించి ఈ-చలానాల ద్వారా జరిమానాలు విధించారు.

ఈ సందర్భంగా ఎస్సైలు మాట్లాడుతూ.. రహదారి భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తు.చ తప్పకుండా పాటించాలని సూచించారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా రోడ్లపైకి వస్తే ఉపేక్షించేది లేదని, రికార్డులు ఉంటేనే వాహనాలు నడపాలని స్పష్టం చేశారు. ప్రమాదాల నివారణకే నిరంతరం ఇలాంటి తనిఖీలు చేపడతామని హెచ్చరించారు.

## శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి దసరా

# మహోత్సవాల ఆహ్వాన పత్రిక విడుదల.

బనగానపల్లె, అక్టోబర్ 10,పల్లెవెలుగు పట్టణము లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి



నవరాత్రి దసరా మహోత్సవాల ఆహ్వాన పత్రికను శనివారం ఆర్యవైశ్య సంఘంజిల్లా అధ్యక్షుడు టంగుటూరి సీనయ్య, బనగానపల్లె అధ్యక్షుడు కాసుల జంగం శెట్టి,ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బనగానపల్లె కొండపేటలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయములో శ్రీ దేవి శరన్నవ రాత్ర మహోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 11వ తేదీన నుండి 23వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈనెల 11వ తేదీ న, శ్రీ బాలత్రిపుర సుందరి దేవి అలంకారం తో, 12వ తేదీన శ్రీ గాయత్రీ దేవి అలంకారంతో, 13వ తేదీన అన్నపూర్ణ దేవి అలంకారముతో, 14 తేదీన మహా చండీ దేవి అలంకారం తో, 15వ తేదీన లలితా త్రిపుర సుందరి దేవి అలంకారంతో, 16వ తేదీన శ్రీ సరస్వతి దేవి అలంకారముతో, 17వ తేదీన శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారముతో, 18వ తేదీన శ్రీ దుర్గా దేవి అలంకారంతో, 19 తేదీన శ్రీ మహిషాసుర మర్దిని దేవి అలంకారంతో, 20వ తేదీన శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారముతో, 21వ తేదీన అమ్మవారి రథోత్సవము, 22వ తేదీన వసంతోత్సవం, 23వ తేదీన చల్ల ముద్దతో, దసరా ఉత్సవాలు ముగిస్తుంది కావున ప్రతి ఒక్కరూ ఉత్సవాల లో పాల్గొని వైభవముగా జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బింగమల్ల సుబ్రహ్మణ్యం శెట్టి,జిల్లా ఆర్య వైశ్య సంఘము ప్రధాన కార్యదర్శి శ్రీ రామ వెంకట సుబ్రహ్మణ్యం (రావీ), ఇటిక్యాల శరత్ బాబు( చెరువుపల్లి ),నల్లగట్ల శివయ్య, జిల్లా కోశాధికారి వంకదార వేణుగోపాల్,జాయింట్ సెక్రటరీ కేతపల్లి శివరాజ్, ఆర్గనైజర్ సెక్రటరీ వేముల రామకృష్ణయ్య, కోశాధికారి నూకల మధుసూదన్, భరతుడు, తదితరులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాలకు నంద్యాల వెళ్లిన మహానందీశ్వరుడు



మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్య క్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్ల ఉత్సవమూర్తులు నంద్యాలలోని బ్రహ్మ నందీశ్వరస్వామవారి దేవస్థానంలో జరిగే దేవీశరన్నవరాత్రి మహోత్సవాలకు బయలుదేరి వెళ్లారు.దసరా పండుగ వరకు స్వామి అమ్మవార్లు అక్కడే ఉంటారు. ఇందులో భాగంగానే శనివారం మహానందిలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతరాయశర్మ, అర్చకులు రాఘవేంద్రశర్మ, వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి, ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో మధు, పర్యవేక్షకులు అంబటి శశిధరరెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## మైలేరి సురేఖ ప్రమాణ స్వీకారానికి

# జనసైనికులు అందరూ ఆహ్వానితులే


భూపనపాటి శేఖర్ టిడిపి నాయకుడు దొర్నిపాడు

దొర్నిపాడు అక్టోబర్ 10 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న పవన్ కళ్యాణ్ అభిమానులు, చిరంజీవి అభిమానులు ,జనసేన పార్టీ నాయకులు ,కార్యకర్తలు జనసైనికులు అందరూ ఆదివారం ఆర్లగడ్డలో జనసేన పార్టీ అభ్యర్థి మైలేరి సురేఖ మార్కెట్ యార్డు చైర్మన్ గ ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యక్రమానికిఅందరూ ఆహ్వానితులేనని మండల కూటమిప్రభుత్వ నాయకులు పగడాల శ్రీనివాసరావు, శీలయ్య భూపనపాటి శేఖర్ పిలుపునిచ్చారు,ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కుల, మత రాజకీయాలకు అతీతంగా జనసైనికులు అందరూ ఈ కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు, కార్యక్రమానికి హాజరైన జనసైనికులు ప్రజలఅందరికీ భోజన వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు

# యువకుడు పై దాడి.. కేసు నమోదు

మహానంది, పల్లె వెలుగు మహానంది గ్రామంలో ఓ చికెన్ సెంటర్ వద్ద జరిగిన ఘర్షణలో మహేష్ అనే యువకుడు పై కర్రతో దాడి చేసిన శ్యామ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. చికెన్ షాప్ లో మహేష్ అనే వ్యక్తి పని చేస్తున్నాడు అన్నారు. చికెన్ కోసం శ్యామ్ అనే వ్యక్తి అప్పు అడగగా షాపు తనది కాదని తాను ఇక్కడ పనిచేస్తున్నానని చెప్పాడన్నారు. అప్పుగా చికెన్ ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన శ్యామ్ అతనిపై కర్రతో దాడి చేశారన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నామని ఎస్సై తెలిపారు.

## ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి.

**ఢిల్లీలో పోరాటానికి సంఘీభావంగా పాండవగల్‌లో ప్రజా సంఘాల నిరసన.**

ఆదోని (పల్లె వెలుగు):ఢిల్లీలో జరిగిన పోరాటానికి సంఘీభావంగా ఆదోని మండలం





పాండవగల్ గ్రామంలో ప్రజా సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్‌ను ఎన్నికల విధుల నుంచి తొలగించాలని, తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆదోని మండల అధ్యక్షుడు జె. రామాంజనేయులు, నాయకులు కే. పాండురంగ, ఎస్. అనీఫ్ మాట్లాడుతూ ఎన్నికల అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసనలో సీపీఎం అనుబంధ సంఘాలైన సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొని తమ డిమాండ్లను వినిపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కే. పాండురంగ, ఎస్. అనీఫ్, కే. ఈరన్న, కే. నర్సిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కే. కృష్ణ, వై. తాయన్న, రైతు సంఘం నాయకులు ఎన్. హనుమంతు, కే. భీమా, కే. హనుమంతరెడ్డి, డీవైఎఫ్ఐ నాయకులు ఎల్. ఓంకార, కే. నాగరాజు, కే. రమేష్, ఎస్. మాభాష తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధారణపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్.

**-రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించిన ట్రాఫిక్ సీఐ మహమ్మద్ గౌస్.**

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణంలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ మహమ్మద్ గౌస్ సూచించారు. పట్టణంలో హెల్మెట్ వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు రహదారి ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల సమయంలో తలకు తీవ్రమైన గాయాలు కలిగే ముప్పును తగ్గించవచ్చని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, తమ ప్రాణాలతో పాటు ఇతరుల భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాహనదారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.



## చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను

# విధుల నుంచి వెంటనే తొలగించాలి

పల్లెవెలుగు బేతంచెర్ల అక్టోబర్ 10:- జ×ుఖ జిల్లా




ఉపాధ్యక్షులు వై. ఎల్లయ్య, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ బేతంచెర్ల భారత్ బేకరీ సర్కిల్ నందు మోటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి. రామాంజనేయులు అధ్యక్షతన ా×= కి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో జ×ుఖ జిల్లా ఉపాధ్యక్షులు వై. ఎల్లయ్య, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామ్మోహన్, రైతు సంఘం మండల అధ్యక్షులు సి. మద్దిలేటి స్వామి మాట్లాడుతూ.. ఢిల్లీలో కూర్చున్న జ్ఞానేశ్ కుమార్ ా×= పేరుతో ఓట్లను తొలగించడానికి కుట్ర చేస్తున్నారని అన్నారు. బీహార్ లో 65 లక్షల ఓట్లు తొలగించారని, ఇప్పుడు దేశవ్యాప్తంగా 13.8 కోట్ల ఓట్లు తొలగించే విధంగా ఇదే పద్ధతి కొనసాగిస్తున్నారని విమర్శించారు. మన దగ్గర ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, రేషన్ కార్డు ఉన్నా, మళ్లీ ఫారం-6 లో తాత పుట్టిన సర్టిఫికెట్ తెమ్మంటున్నారని, మన తాత 1940లో పుడితే ఆ సర్టిఫికెట్ ను బ్రిటిషోడు కూడా ఇవ్వలేదని, ఇది పేదోడి ఓటును అడ్డుకోవడానికి పెట్టిన కుట్ర అని అన్నారు. ఇది ఒక్క జ్ఞానేశ్ కుమార్ చేస్తున్నది కాదని, మోడీ, అమిత్ షా, బీజేపీ, ఆర్ఎస్ఎస్ లు కలిసి చేస్తున్న కుట్ర అని అన్నారు. ఎన్నికల కమిషన్ నియామకంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ను తొలగించి తమ చెప్పుచేతల్లో ఉండే వారిని తెచ్చుకున్నారని ఆరోపించారు. ఓటు లేకపోతే ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుడు కనీస వేతనం, రైతుకు గిట్టుబాటు ధర, ఇళ్ల పట్టాలు అడగలేమని, అందుకే మన ఓటును లాక్కుంటున్నారని అన్నారు.

జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే తొలగించాలనీ, ా×= పేరుతో తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలనీ,ఫారం-6 లో తెచ్చిన దొంగ నిబంధనలు రద్దు చేయాలని,ఎన్నికల కమిషన్ నియామకంలో చీఫ్ జస్టిస్ ను తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో లారీ వర్కర్స్ యూనియన్నాయకులు, రైతుసంఘం నాయకులు,ఆటో వర్కర్స్ యూనియన్నాయకులు , హమాలీ సంఘం నాయకులు కే. రామకృష్ణ, జాకీర్, ఎస్. రామాంజనేయులు, జె. శ్రీనివాసులు, బి. నాగేశ్వరరావు, బాలకృష్ణ, ఎస్. షాల్మియా, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఈసి జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి. వామపక్షాల డిమాండ్.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరించి ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధికారం వచ్చేలాగున ఈసీ ని అడ్డం పెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడిన సిఇసి జ్ఞానేశ్ కుమార్ ని వెంటనే తొలగించాలని సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో సిఇసి జ్ఞానేశ్ కుమార్ శవయాత్ర సిఐటియు జిల్లా కార్యాలయం నుండి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మీదుగా సాయిబాబా నగర్ వరకు పూలు బొరుగులు, చల్లుతూ ప్రదర్శన చేయడం జరిగింది . ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు కే మహమ్మద్ గౌస్ అధ్యక్షత వహించగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ నాయక్,సీనియర్ నాయకులు తోట మద్దులు, సి ఐ టి యు పట్టణ కార్యదర్శి వెంకట లింగం,జిల్లా కార్యదర్శి వెన్న బాలవెంకట్, లక్ష్మణ్,ప్రజా సంఘాల జిల్లా నాయకులు ఎమ్మార్ నాయక్, సురేష్, శ్రీనివాస రెడ్డి,రత్నమయ్య, చెరుకు కృష్ణ, వీరసేన, బాలహుస్సేని వీరితోపాటు మరికొంతమంది కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ నాయక్ లు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమీషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని,ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని,ఓటర్ల జాబితా నుండి అన్యాయంగా తొలగించిన వారందరికీ ఓటు హక్కును పునరుద్దరించాలని,ఈసీఐ నియామకంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండాలని,ప్రజాతంత్ర పద్ధతిలో స్వతంత్రంగా




పనిచేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమం తీవ్ర రూపం దాలుస్తుందని ముఖ్యంగా ఇటీవల ఇండియన్ ఎక్స్ప్రెస్ లో వచ్చిన కథనం యావత్ భారతదేశాన్ని కుదిపేసిందని ముఖ్యంగా దేశవ్యాప్తంగా 13 కోట్ల 80 లక్షలకు పైగా ఓటర్లను తొలగించడం అంటే సామాన్య విషయం కాదని దీంట్లో బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తూ బిజెపికి వ్యతిరేకమైన ఓట్లను ముఖ్యంగా ముస్లిం, క్రిస్టియన్,అదేవిధంగా ఇతర ప్రతిపక్ష పార్టీల కు చెందిన కార్యకర్తల ఓట్లను తొలగించడంలో ప్రధాన పాత్ర సిఇసి జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వివరించడం వలన జరిగిందని, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు మహారాష్ట్ర లాంటి రాష్ట్రాలలో బిజెపికి సహకరించి అధికారంలోకి వచ్చేందుకు అనేక కుట్రలను సిఇసి జ్ఞానేశ్ కుమార్ పడి ఏకపక్ష నిర్ణయాలతో బిజెపికి అధికారం రావడం కోసం కృషి చేయడం జరిగిందని, వెంటనే సిఇసి జ్ఞానేశ్ కుమార్ ను తొలగించి ప్రజాస్వామ్య బద్ధంగా తొలగించిన ఓటర్లందరినీ యధావిధిగా కొనసాగించాలని ఇప్పటికైనా రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్య పద్ధతిలో పనిచేసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈసీ లో ఉండే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను తొలగించి, కఠిన చర్యలు తీసుకునేంతవరకు దేశవ్యాప్త ఉద్యమానికి ప్రతిపక్ష, వామపక్ష పార్టీలు, జెన్ జి లు శ్రీకారం చుట్టాయని అన్నారు. ఈరోజు విద్యార్థి యువజన సంఘాల కామా కాక్రోచ్ జనతా పార్టీల ఆధ్వర్యంలో చేపట్టే శాంతితా ప్రదర్శనకు బిజెపి ప్రభుత్వం వణికిపోయి ఎక్కడికి ఎక్కడ దేశవ్యాప్తంగా ఉన్న జెన్ జి లను అరెస్టు చేయడం చాలా దుర్మార్గమని, రాబోయే కాలంలో ఈ ఉద్యమం మరింత తీవ్ర రూపం దాల్చనిందని బిజెపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

---

## ఓటర్ల జాబితా సవరణలో ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలి.

**ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలి.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా అందిన దరఖాస్తులను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని రోల్ అబ్జర్వర్, రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్మెంట్ డైరెక్టర్ ప్రశాంతి ఎన్నికల అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలన, ధ్రువీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ప్రతి దశలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

శనివారం బనగానపల్లె, నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఆమె పర్యటించి, ఓటర్ల జాబితాకు సంబంధించి అందిన ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులతో పాటు వాటికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. దరఖాస్తుల వివరాలు, వాటి ధ్రువీకరణకు సంబంధించిన ఆధారాలు, రికార్డుల నిర్వహణ తీరును సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దరఖాస్తుల స్వీకరణ నుంచి పరిశీలన, ధ్రువీకరణ, పరిష్కారం వరకు ప్రతి దశను నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులను అందుబాటులో ఉన్న ఆధారాలతో సమగ్రంగా పరిశీలించి, నిర్ణీత విధానాలను అనుసరించాలని తెలిపారు. రికార్డుల నిర్వహణలో గుర్తించిన లోటుపాట్లను తక్షణమే సరిదిద్దాలని, సంబంధిత ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం, ఖచ్చితత్వానికి ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రశాంతి స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సంబంధిత ఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## -- యువత నషా ముక్త భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, మాదకద్రవ్యాల రహిత భారతదేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. మేరా యువ భారత్, నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నంద్యాల బ్లాక్ స్థాయిలోని రాజీవ్ గాంధీ మెమోరియల్ ఇంజినీరింగ్ కళాశాల (ఆర్ జి యం ఇంజనీరింగ్ కాలేజ్)లో "నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ -- నషా ముక్త యువ" కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య వనరుల వ్యక్తులుగా నంద్యాల జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీ శ్రీకాంత్ రెడ్డి, పాణ్యం మండల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం కోఆర్డినేటర్ డాక్టర్ డి. లెనిన్, శ్రీ వెంకటేశ్వర రెడ్డి, నంద్యాల జిల్లా యువజన అధికారి శ్రీ టి. ఇసయ్య పాల్గొని యువతకు అవగాహన కల్పించారు.

జిల్లా యువజన అధికారి టి. ఇసయ్య మాట్లాడుతూ, మై భారత్ పోర్టల్‌లో యువత నమోదు చేసుకోవాల్సిన ప్రాముఖ్యతను, మై భారత్ ద్వారా నిర్వహిస్తున్న వివిధ యువజన కార్యక్రమాలను వివరించారు. యువత ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సామాజిక సేవలో ముందుండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

నంద్యాల జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక దుష్ప్రభావాలను వివరించారు. వ్యసనాల కారణంగా కుటుంబాల్లో ఏర్పడే సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక సంబంధాలపై పడే ప్రతికూల ప్రభావాలను వివరిస్తూ, యువత బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

పాణ్యం మండల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం వల్ల వ్యక్తులు, కుటుంబాలు, సమాజం ఎదుర్కొనే సమస్యలను వివరించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలు, నేరాలకు పాల్పడినప్పుడు ఎదురయ్యే శిక్షలు, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండటంతో పాటు, మాదకద్రవ్యాల అక్రమ వినియోగం మరియు సంబంధిత కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

డాక్టర్ డి. లెనిన్, ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం కోఆర్డినేటర్, విద్యార్థులు తమ భవిష్యత్తుపై దృష్టి సారించి, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా సమాజాభివృద్ధికి తోడ్పడాలని ప్రోత్సహించారు.

వెంకటేశ్వర రెడ్డి యువతలో మాదకద్రవ్యాలపై అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించి, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వ్యసనాల నివారణ, యువత బాధ్యత, కుటుంబాలు మరియు సమాజంపై మాదకద్రవ్యాల ప్రభావం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వ్యసనాలకు బానిసైన వారిని చిన్నచూపు చూడకుండా, వారికి తగిన చికిత్స మరియు పునరావాసం పొందేందుకు సహకరించాలని సూచించారు.

అనంతరం పాల్గొన్న యువత "నషా ముక్త యువ" ప్రతిజ్ఞ చేసి, తాము మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, తోటి యువతకు అవగాహన కల్పిస్తామని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని సంకల్పించారు.

యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడం, దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం ఈ నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మేరా యువ భారత్ నంద్యాల జిల్లా నిర్వాహకులు తెలిపారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన పి. ప్రశాంతి

*-డైరెక్టర్, రీ హెబిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్ మరియు ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ నంద్యాల జిల్లా అయినా పి ప్రశాంతి ఐఏఎస్ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ -- 2026లో భాగంగా నందవరం గ్రామంలోని జెడ్.పి.హెచ్.ఎస్. ఉన్నత పాఠశాలను సందర్శించి ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన కార్యక్రమాలను పరిశీలించారు.*

బనగానపల్లె, అక్టోబర్ 10,పల్లెవెలుగు ఈ సందర్భంగా డైరెక్టర్ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్, ఓటర్ల వివరాల ధృవీకరణ తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటర్ల జాబితాలో స్థానం కల్పించేలా, అర్హత లేని లేదా మరణించిన వ్యక్తుల వివరాలు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన పేర్లు వంటి అంశాలను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశీలించాలని సూచించారు. అలాగే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, నిష్పాక్షికత పాటించాలని అధికారులకు సూచించారు.





ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, కాలపరిమితికి అనుగుణంగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, అర్హులైన ఓటర్లందరికీ అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ శ్రీ వై నరేంద్ర నాథ్ రెడ్డి , ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ శ్రీ అనిల్ కుమార్ మరియు బనగానపల్లె నియోజకవర్గానికి సంబంధించిన ఐదు మంది తహసీల్దారులు శ్రీ వి చంద్రశేఖర్ బనగానపల్లె తాసిల్దార్,శ్రీ పి చంద్రశేఖర్, సంజామల తాసిల్దార్, శ్రీ పవన్ కుమార్ రెడ్డి కోయిలకుంట్ల తాసిల్దార్, శ్రీ ఫకీర్ అహ్మద్, అవుకు తాసిల్దార్ మరియు శ్రీ షఫీ కొలిమిగుండ్ల తాసిల్దార్ మరియు ఎలక్షన్స్ సూపర్వైజర్లు, నందవరం మరియు నందివర్గం గ్రామాలకు సంబంధించిన బూత్ స్థాయి అధికారులు (బీూలు) మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కనక వీడు గ్రామములో పోలీసుల పల్లె నిద్ర

నందవరం పల్లె వెలుగు అక్టోబర్ 10 కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు సబ్ డివిజన్ డి.ఎస్.పి ఏ, శ్రీనివాసులు పర్యవేక్షణలో ఈ రాత్రి 10-10-2026వ ప్రజలకు చట్టాలపై అవగాహన, నేరాల వలన కలిగే కష్టనష్టాల గురించి ప్రజలకు తెలియజేశారు ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వా.చిరంజీవి , నందవరం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ వీ. తిమ్మారెడ్డి , మరియు నందవరం పోలీసు బృందంతో కనక వీడు గ్రామంలో పల్లె నిద్ర చేశారు ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వా.చిరంజీవి ప్రజలకు మద్యం తాగుట, గంజాయి వాడటం, పేకాట, మట్కా వంటి జూదములు ఆడడము వంటి చెడు అలువాట్ల వలన కలిగే కష్ట నష్టాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి వాడటము వలన యువత భవిష్యత్తునాశనం అవుతుందని, వారి కుటుంబము ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతుందని వివరించారు. ఎవరైనా అక్రమ మద్యం అమ్మినా, గంజాయి లేదా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారి యొక్క సమాచారం 1972 నెంబర్ కు ఫోన్ చేయాలని, అదే విధంగా సైబర్ నేరాలు గురించి అప్రమత్తంగా



వుండాలని, సైబర్ మోసాలు జరిగితే 1930 కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. బాల్య వివాహాలు చేయరాదని సూచించడమైనది. నేరాలు చేస్తే కఠినమైన చర్యలు ఉంటాయని ఎవరు కూడా నేరాలకు పాల్పడకూడదని ప్రజలు శాంతియుతంగా జీవించాలని, సూచించడమైనది. అదే విధంగా రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని ఎటువంటి గొడవలు బెదిరింపులు అక్రమ కార్యకలాపాలు మరియు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులు చేపట్టరాదని సూచించినారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పోలీస్ శాఖ ముందస్తు చర్యలు తీసుకుంటుందని ప్రజల స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రత కల్పిస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు

# ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధి మా ధ్యేయం

## -ఆళ్లగడ్డలో అభివృద్ధి పనులకు శ్రీకారం

## -ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ

ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 10, పల్లె వెలుగు ఆళ్లగడ్డ పట్టణంలో 3 కోట్లతో అభివృద్ధి





పనులకు శ్రీకారం చుట్టి, 70 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, డ్రైనేజి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శనివారం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బృందావన్ కాలనీలో తొమ్మిది రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో ఆళ్లగడ్డ మున్సిపాలిటీకి హ్యామ్ పథకం కింద రూ.21 కోట్ల నిధులు లభించాయన్నారు. వీటితో రోడ్లు, కాలువలతో పాటు మున్సిపల్ భవనానికి రూ.3 కోట్లు, పార్కు అభివృద్ధికి రూ.2.5 కోట్లు, టిడ్కో ప్రాంత అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. ఎంవీ నగర్, వీవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో కూడా అభివృద్ధి పనులు పూర్తవుతున్నాయని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో చేసిన అభివృద్ధినే ప్రజల ముందుంచి ఓట్లు కోరుతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి, ఏపీపీ శివప్రసాద్, దస్తగిరి ,బ్యాంకు బాలిరెడ్డి మాజీ కౌన్సిలర్ హుస్సేన్ భాష కాలనీవాసులు టిడిపి నాయకులు కార్యకర్తలు భూమా అభిమానులు పాల్గొన్నారు.

# చలో లోక్ సభ భవన్ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల అరెస్టు.

## -కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్.

ఆదోని (పల్లె వెలుగు): కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి






తొలగించాలని, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన చలో లక్నో భవన్ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు సహా విద్యార్థి, యువజన సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని, ఓటర్ల హక్కులను పరిరక్షించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే చర్యలను ఆపాలని, ఓటర్ల హక్కులను పరిరక్షించాలని, అరెస్టులతో ఉద్యమాలను అడ్డుకోలేరని నాయకులు స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కును గౌరవించాలని, అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## రావులపాలెం, వాడపల్లి వేంకటేశ్వరస్వామి రహదారి విస్తరణ

రావులపాలెం/వాడపల్లి, అక్టోబర్ 10 పల్లె వెలుగు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషితో రావులపాలెం, వాడపల్లి వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వెళ్లే ఏటిగట్టు రహదారి విస్తరణ పనులు ముందుకు వెళ్లడానికి మార్గం సుగమం అవుతుంది. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంజూరు చేసిన రూ.6 కోట్లతో పాటుగా, పుష్కర నిధులు, ఇతరత్రా నిధులతో కలిపి రూ.8 కోట్లు ఈ రహదారి నిర్మాణానికి ఇప్పటికే మంజూరయ్యాయి. నానాటికి పెరుగుతున్న భక్తుల రద్దీ, వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి రూ.19 కోట్లతో రహదారి విస్తరణ చేపట్టి, అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. దీనితో ఏపీ పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ బి బాలునాయక్, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ ఎస్ఈ పి రామకృష్ణారెడ్డి, ఈఈ సీతంనాయుడు, డీఈఈ అన్యం రాంబాబు, అధికారులు శనివారం రహదారిని పరిశీలించారు. ఏపీ ఆర్ ఆర్ ఎస్ పి నిధుల నుంచి జాతీయ రహదారి నుంచి వాడపల్లి కి ఏటిగట్టు రోడ్ మంజూరు,5.5 మీటర్ల వెడల్పున చేయడానికి క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టారు. అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వారు తెలిపారు

# 25 ఏళ్ల వ్యాపారుల కల సాకారం, జ్యోతుల
# నెహ్రూ షాపింగ్ కాంప్లెక్స్ ఆవిష్కరణ



జగ్గంపేట, అక్టోబర్ 10 పల్లె వెలుగు నూతనంగా ఏర్పాటు చేసిన జ్యోతుల నెహ్రూ షాపింగ్ కాంప్లెక్స్ నామకరణ బోర్డు ఆవిష్కరణ శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. షాపింగ్ కాంప్లెక్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆశీర్వాద్ రియల్ ఎస్టేట్ అధినేత కింతాడ రాజు ఆధ్వర్యంలో ఈ నేమ్ బోర్డును కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కింతాడ రాజు మాట్లాడుతూ ఇరవై ఐదు సంవత్సరాలుగా సొంత షాపు లేక రోడ్లపై వ్యాపారాలు చేసుకుంటూ ఎన్నో అవస్థలు పడ్డామని మాకు వ్యాపార సముదాయం ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. యువనేత జ్యోతుల నవీన్ మా అందరికీ శాశ్వత పట్టాలు అందిస్తామని హామీ ఇవ్వడం ఎంతో భరోసానిచ్చిందని ఇరవై ఐదు ఏళ్ల మా ఎదురుచూపులకు నేడు తగిన ఫలితం దక్కిందని చెప్పారు. ఈ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీను మణిబాబు ఎస్వీఎస్ అప్పలరాజు మారిశెట్టి భద్రం దేవరపల్లి మూర్తి రాష్ట్ర డైరెక్టర్లు కొత్త కొండబాబు గెద్దాడ సత్యవేణి అన్నవరం బోర్డు సభ్యులు నాగేంద్ర చౌదరి సత్తి సదాశివరెడ్డి పీలా మహేష్ ఎస్.ఏ. గఫూర్ సాంబత్తుల చంద్రశేఖర్ ఎస్.వి. ప్రసాద్ నలమాటి ఆనంద్ కోంద్రోతు శ్రీను కూటమి నాయకులు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో మహా అన్న సమారాధన

జగ్గంపేట, అక్టోబర్ 10 పల్లె వెలుగు వాకర్స్ హెల్త్ క్లబ్ స్థాపించి ఇరవై ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా మహాలయ పితృ పక్ష అమావాస్యను పురస్కరించుకుని పితృదేవతల సంతృప్తి కొరకు మహా అన్న సమారాధన కార్యక్రమాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆనవాయితీగా వస్తున్న ఈ కార్యక్రమం ఈ ఏడాదితో ఆరవ సంవత్సరానికి చేరుకుంది. ఈ కార్యక్రమాన్ని వాకర్స్ హెల్త్ క్లబ్ వ్యవస్థాపకులు కొత్తకొండ బాబు జగ్గంపేట పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ రఘునాథ్ వాకర్స్ హెల్త్ క్లబ్ గవర్నర్ తోలేటి సూర్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదానం మించిన దానం లేదనే సదుద్దేశంతో వందలాది మంది నిరుపేదలకు అన్న ప్రసాద వితరణ చేశారు. సేవే లక్ష్యంగా ఇరవై ఐదేళ్లుగా క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని అతిథులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పొట్టి రాజేష్ కార్యదర్శి మానేపల్లి సతీష్ నిట్టాల శ్రీనివాస్ పూర్వ జిల్లా గవర్నర్ సమిట్ సాయిరామ్ బి వెంకటేష్ రెడ్డి బుద్ధాజీ బొండా వీర సత్య వేట్సా నాగ సత్య బొండా శ్రీరామ్ కొత్త నాగ పండు ఎం బంగ్రరాజు వి రాధాకృష్ణారావు కర్రి సత్యనారాయణ పుర్రే సూరన్న ఎం సురేష్ రెడ్డి సుబ్బారాయుడు మల్లేశ్వరరావు పి జోగిరాజు బి అప్పలరాజు మాతంశెట్టి శ్రీను తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు



## జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్‌కు యాభై వేల విరాళం



జగ్గంపేట, అక్టోబర్ 10 పల్లె వెలుగు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ సేవల స్ఫూర్తితో జగ్గంపేట మండలం రాజపూడి గ్రామానికి చెందిన యువకుడు బురపు సంజయ్ శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యాభై వేల రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బురపు సంజయ్ మాట్లాడుతూ తన అభిమాన నేత జ్యోతుల నవీన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి ఎంతో ప్రేరణ పొందానని ఆయన సేవలో భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో ఈ ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. పేద ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం చదువుకునే విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఫీజుల చెల్లింపు ప్రభుత్వ పాఠశాలలకు వసతులు బస్సు షెల్టర్ల నిర్మాణం నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీ ఉచిత కోచింగ్ వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వారి సేవా నిరతికి ముగ్ధుడనై ఈ విరాళం అందించినట్లు పేర్కొన్నారు. ఈ విరాళాన్ని స్వీకరించిన జ్యోతుల నవీన్ బురపు సంజయ్‌ను ఘనంగా అభినందించి అతని సేవా దృక్పథాన్ని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీను మణిబాబు మారిశెట్టి భద్రం దేవరపల్లి మూర్తి రేఖ బుల్లిరాజు జాస్తి వసంత్ పురంశెట్టి శివాజీ పీలా మహేష్ వెలిశెట్టి బుజ్జి వైభోగల శ్రీనివాసయాదవ్ చేలికాని హరికోపాల్ బండారు నాని తదితరులు పాల్గొన్నారు

## ముంపు సమస్య లేకుండా భారీ మురుగు కాల్వ నిర్మిస్తాం

వేమగిరి, అక్టోబర్ 10 పల్లె వెలుగు కడియం మండలం వేమగిరిలో ముంపు సమస్య లేకుండా భారీ మురుగు కాలువ నిర్మాణానికి ప్రాణాలిక చేయాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. కొండ కాలువ ఆక్రమణలకు గురైందని వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన ఎమ్మెల్యే గోరంట్ల శనివారం దేవీ జనార్ధన్ నగర్, కెవిఆర్ లేఅవుట్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. కొండ కాలవ దారి మార్గం గుండా మోటార్ సైకిల్ పై పర్యటించి క్షుణ్ణంగా ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.. కొండ కాలవ ప్రాంతంలో గత 35 ఏళ్లుగా ఎస్సీ ,ఎస్టీ,బీసీ సమాజికవర్గాలకి చెందిన నిరుపేదల 67 కుటుంబాలు నివాసం ఉంటున్నామని తమ ఇల్లు కూల్చివేస్తే గతి ఏమిటని పలువురు మహిళలు ఎమ్మెల్యే వద్ద ఆందోళన వ్యక్తం చేశారు.. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ గ్రామంలో ముంపు సమస్య లేకుండా కొండ కాలవలో రీ సర్వే జరిపి డ్రైన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అక్కడ నుండే ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు మాట్లాడి మురుగు కాలువ నిర్మాణానికి ప్రణాళికలు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, చెల్లుబోయిన శ్రీనివాస్, సూరపురెడ్డి జానకిరామ్, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, కోలా శ్రీనివాస్, అల్లంపల్లి ప్రసాద్, ఈదుపుగంటి బుజ్జి, దంగేటి శ్రవణ్ కుమార్, ద్రాక్షరపు వాసు తదితరులు ఉన్నారు



# మాజీ ఎంపీ హర్షకుమార్ హౌస్ అరెస్ట్‌పై ఆగ్రహం

### ప్రభుత్వ నిరంకుశ పాలన నిదర్శనం.. పోలవరం ప్రాజెక్టు పనితీరుపైనా ఘాటు విమర్శలు



రాజమండ్రి, అక్టోబర్ 10 పల్లె వెలుగు మాజీ ఎంపీ హర్షకుమార్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాను విజయవాడలో జరిగే కా ర్య క్ర మా ని కి హాజరయ్యేందుకు బయలుదేరడానికి సిద్ధమవుతున్న సమయంలో ఉదయం 7 గంటలకే పోలీసులు తనను హౌస్ అరెస్ట్ చేశారని తెలిపారు. విజయవాడకు సుమారు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న తనను హౌస్ అరెస్ట్ చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుతంగా ప్రయాణించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, అయితే తనను విజయవాడకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు గుప్పించిన హర్షకుమార్, తనను హౌస్ అరెస్ట్ చేయడాన్ని ప్రభుత్వ నిరంకుశ పాలనకు ఒక ఉదాహరణగా అభివర్ణించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి, కార్యక్రమాల్లో పాల్గొనడానికి అవకాశం కల్పించాలని ఆయన పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు పనితీరుపైనా హర్షకుమార్ విమర్శలు చేశారు. ప్రాజెక్టు పనులు సక్రమంగా సాగడం లేదని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పనుల పురోగతిపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హర్షకుమార్ పేర్కొన్నారు. తన హౌస్ అరెస్ట్‌కు దారితీసిన పరిస్థితులపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు

## వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా అన్నసమారాధన



యానాం, అక్టోబర్ 10 పల్లె వెలుగు యానాం కేంద్రపాలిత ప్రాంతంలోని రెడ్డి రాజుల కాలం నాటి పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందిన భూసమేత వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుమారు ఐదు వందల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. దాతలు పెద్దింటి రఘురామ వినోద్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తుల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ప్రతి శనివారం దాతల సహకారంతో ఆలయంలో నిరంతరం అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి రఘురామ వినోద్ ఆచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు

## రావులపాలెం, వాడపల్లి వేంకటేశ్వరస్వామి రహదారి విస్తరణ



రావులపాలెం/వాడపల్లి, అక్టోబర్ 10 పల్లె వెలుగు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషితో రావులపాలెం, వాడపల్లి వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వెళ్లే ఏటిగట్టు రహదారి విస్తరణ పనులు ముందుకు వెళ్లడానికి మార్గం సుగమం అవుతుంది. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంజూరు చేసిన రూ.6 కోట్లతో పాటుగా, పుష్కర నిధులు, ఇతరత్రా నిధులతో కలిపి రూ.8 కోట్లు ఈ రహదారి నిర్మాణానికి ఇప్పటికే మంజూరయ్యాయి. నానాటికి పెరుగుతున్న భక్తుల రద్దీ, వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి రూ.19 కోట్లతో రహదారి విస్తరణ చేపట్టి, అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. దీనితో ఏపీ పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ బి బాలునాయక్, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ ఎస్ఈ పి రామకృష్ణారెడ్డి, ఈఈ సీతంనాయుడు, డీఈఈ అన్యం రాంబాబు, అధికారులు శనివారం రహదారిని పరిశీలించారు. ఏపీ ఆర్ ఆర్ ఎస్ పి నిధుల నుంచి జాతీయ రహదారి నుంచి వాడపల్లి కి ఏటిగట్టు రోడ్ మంజూరు,5.5 మీటర్ల వెడల్పున చేయడానికి క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టారు. అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వారు తెలిపారు

## అయినవిల్లి ఆలయ అభివృద్ధి
# పనులపై దేవాదాయ కమిషనర్ సమీక్ష

### -అన్నపూర్ణ నిలయం నిర్మాణంలో జాప్యంపై అసంతృప్తి.. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశం



అయినవిల్లి, అక్టోబర్ 10 పల్లె వెలుగు అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న ఆలయాల పునర్నిర్మాణ పనులతో పాటు, భక్తులకు అన్నప్రసాద వసతి కల్పించేందుకు నిర్మిస్తున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి అన్నప్రసాద భవనం (అన్నపూర్ణ నిలయం) నిర్మాణ పనులను దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ పరిశీలించారు. ప్రాంతీయ సంయుక్త కమిషనర్ వి. త్రినాథరావుతో కలిసి ఆయన అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఆలయాల పునర్నిర్మాణంపై సంతృప్తి..క్షేత్రంలో జరుగుతున్న ఆలయాల పునర్నిర్మాణ పనుల పురోగతిపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, భక్తులకు అన్నప్రసాద వసతి కల్పించే లక్ష్యంతో నిర్మిస్తున్న అన్నపూర్ణ నిలయం పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను నిర్ణీత కాలపరిమితి ప్రకారం పూర్తి చేయాలని సంబంధిత సాంకేతిక అధికారులను ఆదేశించారు. సాంకేతిక అనుమతులు సకాలంలో పూర్తి చేయాలి..నిర్మాణ పనులకు అవసరమైన సాంకేతిక అనుమతులు, డ్రాయింగ్‌లు తదితర అంశాలను నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడు పరిశీలించాలని కమిషనర్ సూచించారు. అవసరమైన అనుమతులు, సాంకేతిక ప్రక్రియల్లో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులకు స్పష్టం చేశారు. పనుల వేగవంతానికి సమన్వయం తప్పనిసరి..అన్నపూర్ణ నిలయం నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి సాంకేతిక విభాగం అధికారులతో పాటు గుత్తేదారుతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్ణీత గడువులో నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యం..భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, నిర్మాణ పనుల్లో జాప్యాన్ని నివారించి నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు

## శనేశ్వర స్వామివారికి ఘనంగా తైలాభిషేకాలు



మందపల్లి, అక్టోబర్ 10 పల్లె వెలుగు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ మందేశ్వర శనేశ్వర స్వామివారి దేవస్థానంలో శనివారం అమావాస్య సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు మరియు తైలాభిషేక కార్యక్రమాల ద్వారా భారీగా ఐదు లక్షల పదహారు వేల నాలుగు వందల ముప్పై ఒకటి రూపాయల ఆదాయం సమకూరింది. ఈ మేరకు దేవస్థానం సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు అధికారిక వివరాలను వెల్లడించారు. అమావాస్య శనివారం కావడంతో తెలుగు రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఆలయంలో ముఖమండపం తైలాభిషేకం ద్వారా ఇరవై ఐదు వేల తొమ్మిది వందల రూపాయలు ఏకాదశ రుద్ర తైలాభిషేకం ద్వారా లక్ష తొమ్మిది వేల ఏడు వందల యాభై రూపాయలు మహాన్యాస పూర్వక తైలాభిషేకం ద్వారా తొంబై రెండు వేల యాభై రూపాయలు తైలం సమర్పించి దర్శనం ద్వారా ఇరవై ఏడు వేల ఐదు వందల ఇరవై రూపాయలు వసూలయ్యాయి. అలాగే తిలదానం ద్వారా తొమ్మిది వందల రూపాయలు స్వయం హోమం ద్వారా నాలుగు వేల రూపాయలు కేశఖండన ద్వారా నలభై రూపాయలు లభించాయి. దీని ద్వారా ప్రత్యక్ష పూజల ద్వారా మొత్తం రెండు లక్షల అరవై వేల నూట అరవై రూపాయల ఆదాయం సమకూరింది. పరోక్ష ఆన్లైన్ పూజల ద్వారా రెండు లక్షల పదహారు వేల రూపాయలు అలాగే అన్నప్రసాదం విరాళాల ద్వారా నలభై వేల డెబ్బై ఒకటి రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు

## వెదిరేశ్వరం పలివెల రహదారి మరమ్మతులకు రూ.20కోట్లు



రారారారా, అక్టోబర్ 10 పల్లె వెలుగు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషితో రావులపాలెం బ్రిడ్జి నుంచి వెదిరేశ్వరం మీదుగా పలివెల బ్రిడ్జి వరకు జాతీయ రహదారి 9 కి.మీ ల పొడవునా పాడై దెబ్బతిన్న మట్టి రోడ్డుగా మారిపోయిన మెటల్ రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక మరమ్మత్తుల కింద రూ.20కోట్లు నిధులు మంజూరయ్యాయి. జాతీయ రహదారి 216జు లో 22.730 కి.మీ నుంచి 27.600 కి.మీ వరకూ రూ.10 కోట్లు, 27.600 కి.మీ నుంచి 31.710 కి.మీ వరకూ రూ.10 కోట్లు మొత్తం రూ.20 కోట్లు మంజూరు అయ్యాయి.త్వరలోనే టెండర్లు పిలిచి మూడు నెలల్లో ఈ పనులు చేపట్టనున్నట్లు,ఈ రహదారి అభివృద్ధితో వాహనదారుల సమస్యలు పరిష్కారం కానున్నాయని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వచ్చే సంవత్సరం ఈ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు

## నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



రామచంద్రపురం, అక్టోబర్ 10 పల్లె వెలుగు రామచంద్రపురం కె గంగవరం మండలాల్లో గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. పుష్కరాల అభివృద్ధి పనుల్లో భాగంగా శనివారం రామచంద్రపురం కె గంగవరం మండలాల్లోని మూడు గ్రామాల్లో మొత్తం నాలుగు కోట్ల రెండు లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారి పనులకు ఆయన అధికారులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఈత ఉమామహేశ్వరరావు ఇంటి వరకు ఎనభై ఒక లక్ష రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు వాసంశెట్టి సత్యం శంకుస్థాపన చేశారు. అలాగే రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం బ్రిడ్జి నుంచి రామనర్సు తోట మీదుగా ఎర్రపోతవరం వరకు కోటీ పది లక్షల రూపాయలతో చేపట్టనున్న బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన నిర్వహించారు. కె గంగవరం మండలం కోటిపల్లి గ్రామంలో కుమ్మరిసావరం వరకు నిర్మించనున్న సీసీ అప్రోచ్ రోడ్డుకు కోటీ ఇరవై ఒక లక్ష రూపాయలు సోమేశ్వర స్వామి టెంపుల్ కు వెళ్లే రోడ్డుకు తొంభై లక్షల రూపాయలు అంచనా వ్యయంతో మొత్తం నాలుగు కోట్ల రెండు లక్షల రూపాయలతో చేపట్టనున్న పనులకు వాసంశెట్టి సత్యం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని ప్రజలకు అవసరమైన రహదారులు డ్రైనేజీలు తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈఈ కె శ్రీనివాస్ ఏఈ దాసరి ఏసురత్నం జనసేన ఇంచార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆత్మ చైర్మన్ వెంటూరి వీరరాఘవులు చౌదరి స్టేట్ డైరెక్టర్ సలాది రమేష్ పెంకే అన్నపూర్ణ సాంబశివరావు నిడదవోలు సుబ్రహ్మణ్యం బీజేపీ నాయకులు కర్రి చిట్టిబాబు జి రామకృష్ణ పప్పుల సాయిబాబు ములకల రామచంద్రరావు ఎం పుణ్యమూర్తి కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు

# సూళ్లూరుపేట మున్సిపాలిటీకి కోటి నిధులు మంజూరు

సూళ్లూరుపేట, అక్టోబర్ 10 పల్లె వెలుగు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా పదిహేనవ ఆర్థిక సంఘం నిధుల కింద మున్సిపాలిటీకి కోటి రూపాయలు మంజూరయ్యాయి. ఈ నిధులలో భాగంగా తొలి విడతగా అరవై రెండు లక్షల ఇరవై ఎనిమిది వేల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శనివారం సాయంత్రం స్థానిక శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా నాగరాజపురంలో ఇరవై ఎనిమిది లక్షల యాభై ఏడు వేల అంచనా వ్యయంతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ప్రజల అవసరాలే మా ప్రాధాన్యత అని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి ఇంటికీ మెరుగైన సదుపాయాలు అందించేలా అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. దెబ్బతిన్న రోడ్లకు మోక్షం కల్పిస్తూ పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ సమగ్రంగా అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని ఆమె పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు మున్సిపల్ అధికారులు కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు



# సూళ్లూరుపేటలో సీఐటీయూ మహాసభలు

## అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మహాగర్జన



సూళ్లూరుపేట, అక్టోబర్ 10 పల్లె వెలుగు సూళ్లూరుపేటలో శనివారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీల మహా గర్జన పేరిట భారీ మహాసభ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన వందలాది మంది అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు తమ సమస్యలపై గళమెత్తారు. స్థానిక హోలీ క్రాస్ సర్కిల్ నుండి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ వద్ద బహిరంగ సభలో పాల్గొన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో ఉచిత విద్య ఉచిత వైద్యం అందించడంతో పాటు కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలను కాపాడుకోవడానికి హక్కుల సాధనకు పోరాటమే మార్గమని స్పష్టం చేశారు. అంగన్వాడీలకు నెలకు ఇరవై ఆరు వేల రూపాయల కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పదవీ విరమణ లాభాలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సర్వేలు యాప్‌ల పేరుతో అదనపు భారం మోపడం మానుకోవాలని కేవలం పిల్లల సంరక్షణకే పరిమితం చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కేంద్రాలకు సొంత భవనాలు మరుగుదొడ్లు తాగునీరు గ్యాస్ సౌకర్యం కల్పించాలని కోరారు. కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి పని చేసినా ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు అంగన్వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు

# చెంగాళ్లమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ఏర్పాట్లు



సూళ్లూరుపేట, అక్టోబర్ 10 పల్లె వెలుగు ప్రసిద్ధి గాంచిన శక్తిపీఠం చెంగాళ్లమ్మ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం విజయదశమి శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న శరన్నవరాత్రి మహోత్సవాల కోసం ఆలయ పరిసరాలను రంగురంగుల విద్యుత్ దీపాలు సుగంధ పుష్పాలతో నయన మనోహరంగా అలంకరించారు. ఈ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారు తొమ్మిది రోజుల పాటు రోజుకో ప్రత్యేక అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అమ్మవారి దివ్య మంగళ రూపాలను సందర్శించి పూజలు జరిపించుకునేందుకు ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు పొరుగున ఉన్న తమిళనాడు రాయలసీమ ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు సులభంగా శీఘ్రంగా అమ్మవారి దర్శనం చేసుకునేలా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో తాగునీటి సదుపాయం నిరంతర ప్రసాద వితరణ ఉండేలా చర్యలు తీసుకున్నారు.





స్థానిక పోలీసుల సహకారంతో ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాల నిఘాతో పాటు గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి ప్రసన్నలక్ష్మి దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆదివారం నుంచి ప్రారంభమయ్యే శరన్నవరాత్రి ఉత్సవాలలో భక్తులందరూ విశేషంగా పాల్గొని అమ్మవారి దివ్య అవతారాలను దర్శించుకోవాలని కోరారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొని సదాచార నియమాలతో చెంగాళ్లమ్మ పరమేశ్వరి అమ్మవారి కృపాకటాక్షాలు ఆయురారోగ్యాలు పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. భక్తులందరూ అధికారులకు సిబ్బందికి సహకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు

# మన ఊరు -- మన జెండా కార్యక్రమంలో బీజేపీ జెండా ఆవిష్కరణ





రాజానగరం, అక్టోబర్ 10 పల్లె వెలుగు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75 ఏళ్లు పూర్తి చేసుకుని 76వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మన ఊరు -- మన జెండా' కార్యక్రమంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలోని శ్రీకృష్ణపట్నం, రాధేయపాలెం గ్రామాల్లో బీజేపీ జెండాలను ఆవిష్కరించారు. శ్రీకృష్ణపట్నంలో జిల్లా కిసాన్ మోర్చా ట్రెజరర్ దొడ్డ అర్జునరావు ఆధ్వర్యంలో, రాధేయపాలెంలో జిల్లా జనరల్ సెక్రటరీ మద్దిపాటి రజిని ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర బీజేపీ మాజీ కార్యవర్గ సభ్యులు నీరుకొండ వీరన్న చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరన్న చౌదరి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని 30 గ్రామాల్లో 30 బీజేపీ స్థూపాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ నెల 17వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త మోదీని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డుకు ఎంపికైన శ్రీకృష్ణపట్నం గ్రామ ప్రజలకు, కూటమి నాయకులు, కార్యకర్తలకు, మాజీ సర్పంచ్ కిమిడి శ్రీరామ్‌కు, పంచాయతీ సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కిసాన్ మోర్చా ట్రెజరర్ దొడ్డ అర్జునరావు మాట్లాడుతూ.. జిల్లా నాయకత్వం పిలుపు మేరకు 30 గ్రామాల్లో 30 బీజేపీ జెండాలను ఆవిష్కరించే కార్యక్రమంలో భాగంగా శ్రీకృష్ణపట్నంలో జెండా ఆవిష్కరణ నిర్వహించినట్లు చెప్పారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా శ్రీకృష్ణపట్నం గ్రామానికి జిల్లా ఉత్తమ పంచాయతీ అవార్డు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరై సంఘీభావం తెలిపిన గ్రామ మాజీ సర్పంచ్ కిమిడి శ్రీరామ్, తెలుగుదేశం పార్టీ గ్రామ క్లస్టర్ ఇన్‌ఛార్జి బత్తుల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు మోది సత్తిబాబు, గ్రామ మాజీ సర్పంచ్ కిమిడి శ్రీరామ్, టీడీపీ గ్రామ క్లస్టర్ ఇన్‌ఛార్జి బత్తుల నాగేశ్వరరావు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బీవీ రామారావు, కొండగుంటూరు మాజీ ఎంపీటీసీ పెమ్మనబోయిన వెంకటేష్, జిల్లా జనరల్ సెక్రటరీ మద్దిపాటి రజిని, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు పవన్ కుమార్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు దొడ్డ శ్రీనివాసులు, జిల్లా కిసాన్ మోర్చా ట్రెజరర్ దొడ్డ అర్జునరావు, సోడసాని సత్యనారాయణ, బత్తిన కరుణాకర్, గాలి రాజు, మాచినీడు గోవిందు, ఏలేటి దుర్గారావుతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# పవన్ కళ్యాణ్ పర్యటనకు ప్రత్యేక బస్సులు

## -ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి



గోకవరం, అక్టోబర్ 10 పల్లె వెలుగు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో ఆర్టీసీ డిపో అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. ఈ పర్యటనకు అవసరమైన రవాణా సదుపాయాలను కల్పించడంలో భాగంగా ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్ అజయ్ బాబు తెలిపారు. పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కాకవాడ గండికి ప్రత్యేక బస్సులను కేటాయించాల్సి రావడంతో గోకవరం డిపో పరిధిలో నడిచే కొన్ని సాధారణ ఆర్టీసీ బస్సు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పర్యటనకు హాజరయ్యే ప్రయాణికులకు ఎలాంటి రవాణా లోటుపాట్లు లేకుండా అధికారులు అన్ని రకాల అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అయితే సాధారణ బస్సు సర్వీసుల రద్దు కారణంగా ప్రయాణికులకు కొంత అసౌకర్యం కలిగే అవకాశం ఉందని ముఖ్యంగా రోజువారీ పనులు ఉద్యోగాలు విద్యా అవసరాలు ఇతర వ్యక్తిగత పనుల నిమిత్తం రాకపోకలు సాగించే వారు ముందుగానే తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. బస్సులపై పూర్తిగా ఆధారపడి ప్రయాణించే ప్రజలు రద్దయిన సర్వీసుల వివరాలను క్షుణ్ణంగా తెలుసుకుని అవసరమైతే తక్షణమే ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు

## గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి జాతీయ స్థాయి నాణ్యతా ప్రమాణాల గుర్తింపు



గోకవరం, అక్టోబర్ 10 పల్లె వెలుగు కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన 'నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్' (ఎన్ హెచ్ ఎస్ ఆర్ సి)ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన గోకవరం సామాజిక ఆరోగ్య కేంద్రం లోని లేబర్ రూమ్‌కు (ప్రసవ గది) జాతీయ స్థాయి "లక్ష్య" సర్టిఫికేషన్‌ను మంజూరు చేసింది. ఇటీవల ఏప్రిల్ 28, 2026న నిర్వహించిన బాహ్య మూల్యాంకనంలో గోకవరం సిహెచ్‌సి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 95% మార్కులతో అన్ని నాణ్యతా ప్రమాణాలను నిలబెట్టుకుంది. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఎస్ఆర్‌సి అడ్వైజర్ డాక్టర్ ఆర్.కె. పఠానీ, ఆంధ్రప్రదేశ్ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం) మిషన్ డైరెక్టర్‌కు అభినందన లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా, ఏడాది వ్యవధిలో సదరు ఆసుపత్రిలోని మాతృత్వ ఆపరేషన్ థియేటర్ ని కూడా సిద్ధం చేసి జాతీయ సర్టిఫికేషన్ సాధించాలని కేంద్ర బృందం సూచించింది. స్థానిక వైద్య సిబ్బంది మరియు ఆరోగ్య శాఖ అందించిన ఉత్తమ సేవలకు గాను ఈ గుర్తింపు లభించింది

# ఆధిపత్య ధోరణులు వీడి ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

**దేవిచౌక్ ఆలయం వద్ద పోలీస్ అవుట్ చెక్ పోస్ట్ ఏర్పాటు : సీఐ మూర్తి, తహశీల్దార్ రామకృష్ణ**



గోకవరం, అక్టోబర్ 10 పల్లె వెలుగు గోకవరం దేవీచౌక్ వద్ద చోటుచేసుకుంటున్న వివాదాలపై కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మూర్తి, స్థానిక తహశీల్దార్ రామకృష్ణ స్పందించారు. ఇటీవల కాలంలో స్థానిక దేవిచౌక్ ఆలయంలో ఇరువర్గాలు ఘర్షణలకు దిగడంతో శాంతి భద్రత దృశ్య ఆలయ ప్రాంగణం వద్ద అవుట్ పోలీస్ అవుట్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేసిన అధికారులు.ఇరు వర్గాల వారు ఆధిపత్య ధోరణులకు స్వస్తి పలికి, ఆధ్యాత్మిక భావాలతో ముందుకు సాగాలని వారు సూచించారు. దేవీచౌక్ వంటి ఆధ్యాత్మిక ప్రదేశాల్లో ప్రశాంత వాతావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తి, ఐక్యత, పరస్పర గౌరవానికి ప్రతీకలుగా నిలవాలని, వాటి విషయంలో వివాదాలకు తావివ్వకూడదని సూచించారు. ఇరు వర్గాల వారు సంయమనం పాటిస్తూ, పరస్పరం చర్చించుకుని సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని హితవు పలికారు.ఆధిపత్యం కోసం పోటీ పడటం కంటే ఆధ్యాత్మిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసే చర్యలకు దూరంగా ఉండాలని సీఐ, ఎమ్మార్వో సూచించారు . దేవీచౌక్ వద్ద ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు ఇరు వర్గాల వారు సహకరించాలని వారు కోరారు. స్థానిక ఎస్సై పవన్ కుమార్, ఎంపీడీవో గోవిందు, తంటి కోణం దేవస్థానం చల్లా ఉదయ బాబు నాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# తంటికొండ వెంకన్న కొండకు పోటెత్తిన భక్తులు




గోకవరం, అక్టోబర్ 10పల్లె వెలుగు తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం తంటికొండ స్వయంభు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కొండపై భక్తులు శ్రీవారి దర్శనానికి పోటెత్తారు. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గోవింద నామస్మరణతో కొండపై ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.స్వామివారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఈ సందర్భంగా భక్తుల కోసం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భోజనాలు స్వీకరించారు. భక్తులకు అన్నప్రసాదం అందించడంలో నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తి, సేవాభావంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర, ఆలయ ఈవో చల్ల ఉదయ్ బాబు నాయుడు వచ్చిన భక్తులందరికీ స్వామివారి దర్శనంతో పాటు అన్నప్రసాదం ఏర్పాట్లు పూర్తి చేయడంతో భక్తులు తమ ఆనందం వ్యక్తం చేశారు

## అనారోగ్యంతో బాధపడుతున్న పాపకు ఆసరా చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



యానాం, అక్టోబర్ 10 పల్లె వెలుగు అనారోగ్యంతో అమలాపురంలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పాప వైద్య ఖర్చుల నిమిత్తం ఆసరా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పదమూడు వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. శనివారం ఉదయం ఆసుపత్రికి వెళ్లిన ట్రస్ట్ ముఖ్య సభ్యులు జీలాని కామరాజు షరీఫ్ రాజేష్ పాపను పరామర్శించి వైద్య చికిత్స కోసం ఆ మొత్తాన్ని అందజేశారు. ఈ సహాయంలో భాగంగా కామరాజు తల్లిదండ్రులైన కీర్తిశేషులు మార్నీడి నాగరాజు నాగరత్నం దంపతుల జ్ఞాపకార్థం రెండు వేల రూపాయలు హైదరాబాద్‌కు చెందిన ఉగ్గిరాల సత్తిబాబు దేవి దంపతులు వెయ్యి రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఇతర దాతల సహకారంతో మొత్తం పదమూడు వేల రూపాయలను పాప వైద్య ఖర్చుల నిమిత్తం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులకు ఆర్థిక సహాయం అందించిన దాతలకు ఆసరా చారిటబుల్ ట్రస్ట్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ మానవతా సేవలను మునుముందు కూడా కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com